

# నేటి నిజం

తెలుగు దినపత్రిక





website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | శుక్రవారం 11-9-2020 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-201 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక:33 | పేజీలు: 4 | వెల: రూ.1/-


# రఫేల్ రాకతో శతృదేశాలకు గట్టి హెచ్చరిక

### సరిహద్దుల్లో మరింత అప్రమత్తంగా ఉన్నాం
### అంబాలా స్టేషన్‌లో అట్టహాసంగా ఇండక్షన్ సెర్మనీ
### ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ మరింత బలోపేతం
### పాల్గొన్న భారతరక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్
### హాజరైన ఫ్రాన్స్ రక్షణ మంత్రి

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): రఫేల్ రాకతో మన రక్షణ వ్యవస్థ మరింత బలోపేతం అయ్యిందని, శతృవులకు ఇదో హెచ్చరిక అని పరోక్షంగా చైనాను ఉద్దేశించి రక్షణశాఖమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. భారతదేశ సార్వభౌమత్వంపై కన్ను వేసినవారికి రఫేల్ యుద్ధ విమానాల రంగప్రవేశం గట్టి, బలమైన సందేశాన్ని పంపించిందని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు. ఫ్రెంచ్ నుంచి వచ్చిన 5 రఫేల్ యుద్ధ విమానాలను భారత వాయు సేన (ఐఏఎఫ్)లోకి గురువారం ప్రవేశపెట్టిన సందర్భంగా ఆయన మాట్లాడారు. సరిహద్దుల విషయంలో ఎప్పుడూ బలగాలు అప్రమత్తంగా ఉన్నామని, ఎలాంటి పరిస్థితిని అయినా ఎదుర్కోగలమని అన్నారు. రఫేల్ యుద్ధ విమానాలను గురువారం ఐఏఎఫ్‌లోకి లాంఛనంగా ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, సాయుధ దళాలను, దేశ ప్రజలను అభినందించారు. ప్రస్తుతం సరిహద్దుల్లో ఉన్న వాతావరణాన్ని దృష్టిలో పెట్టుకుంటే, ఈ ఇండక్షన్ ఎంతో కీలకమైందన్నారు. ఇటీవల తాను విదేశీ టూర్‌కు వెళ్లానని, అక్కడ భారత్ అభిప్రాయాన్ని సుస్పష్టం చేసినట్లు రాజ్‌నాథ్ తెలిపారు. ఎటువంటి పరిస్థితుల్లో తమ భూభాగాన్ని వదులుకునేది లేదని తేల్చిచెప్పినట్లు గుర్తు చేశారు. భారతీయ వాయుదళా నికి కంగ్రాట్స్ చెబుతున్నానని, కానీ సరిహద్దుల్లో ఉన్న పరిస్థితులు దురదృష్టకరమని, ఎల్‌ఏసీ వద్ద మీరు చేపట్టిన చర్యలు మీరెంత కట్టుబడి ఉన్నారో చెబుతుందని రాజ్‌నాథ్ తెలిపారు. ఫార్వర్డ్ బేస్‌ల వద్ద ఐఏఎఫ్ దళాలు చాలా వేగంగా తమ ఆయుధ సంపత్తిని చేర్చాయని, దీంతో వాయుదళం ఎంత సంసిద్ధంగా ఉందో తెలుస్తోందన్నారు. రఫేల్ యుద్ధ విమానాలు రంగంలోకి రావడం మన సార్వభౌమత్వంపై కన్ను వేసిన వారికి భారీ, బలమైన సందేశం పంపించిందని చెప్పారు. నేడు రఫేల్ ప్రవేశం ప్రపంచం దృష్టిని, ముఖ్యంగా మన సార్వభౌమత్వంపై కన్ను వేసినవారి దృష్టిని ఆకర్షించే బలమైన సందేశం. మన సరిహద్దుల్లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా, తేలికైన పదాల్లో చెప్పాలంటే, గత కొద్దిరోజులుగా ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఈ ప్రవేశం చాలా ముఖ్యమైనది. మారుతున్న కాలంలో మనం మనల్ని సమాయత్తపరచుకోవలసిన అవసరం ఉందని మనం సంపూర్ణంగా తెలుసుకున్నాం అని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. రఫేల్ ప్రవేశించడంతో ఐఏఎఫ్ సామర్థ్యంలో సాంకేతికపరమైన పైచేయి సాధిస్తూ, విప్లవం వచ్చిందన్నారు. ఇది భారత దేశం, ఫ్రాన్స్ సంబంధాలు బలోపేతమవడానికి నిదర్శనమని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రదర్శించిన దూరదృష్టి వల్ల రఫేల్ యుద్ధ విమానాలు సకాలంలో చేరుకున్నట్లు తెలిపారు. భారతదేశం బాధ్యతాయుతమైన దేశమని, అందువల్ల ఈ బాధ్యత కేవలం ప్రాదేశిక సరిహద్దులకు మాత్రమే పరిమితం కాదని, ఇండో-పసిఫిక్ రీజియన్, ఇండియన్ ఓషన్ రీజియన్ భద్రతను పరిరక్షించే బాధ్యత ఉందని తెలిపారు. ప్రపంచ శాంతికి కట్టుబడి ఉంటూ, అంతర్జాతీయ సమాజానికి సహకరిస్తామని చెప్పారు. భారతదేశ రక్షణ రంగంలో పెట్టుబడులు పెట్టాలని ఫ్రెంచ్ డిఫెన్స్ ఇండస్ట్రీలను ఆహ్వానించారు. ఆటోమేటిక్ రూట్లో 74 శాతం వరకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు పెట్టవచ్చునని చెప్పారు. ఇదే సందర్భంలో హర్యానాలోని అంబాలా ఐఏఎఫ్ స్థావరంలో జరిగిన కార్యక్రమంలో ఐదు రఫేల్ యుద్ధ విమానాలకు వాటర్ కెనన్ వందనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఫ్రాన్స్ రక్షణ మంత్రి ఫ్లోరెన్స్ పార్లీ, చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ బిపిన్ రావత్, ఐఏఎఫ్ చీఫ్ ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్‌కేఎస్ బదౌరియా పాల్గొన్నారు. అంబాలా ఎయిర్ ఫోర్స్ స్టేషన్‌లో రాఫేల్ యుద్ధ విమానాల ఇండక్షన్ సెర్మనీ జరిగింది. ఈ సందర్భంగా రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడారు. రాఫేల్ రాకతో భారత్, ఫ్రాన్స్ మధ్య బంధం బలోపేతమైందన్నారు. రెండు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలు కూడా బలపడ్డాయన్నారు. రాఫేల్ కోసం ఎన్నో అవాంతరాలు ఏర్పడ్డాయని, కానీ ప్రధాని మోదీ బలమైన కాంక్ష వల్ల ఇది సాధ్యమైందన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, వసుదైక కుటుంబం అన్న సూత్రాలకు రెండు దేశాలు కట్టుబడి ఉన్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు. ఈ సూత్రాలనే రెండు దేశాలు ప్రపంచవ్యాప్తం చేస్తున్నాయన్నారు. భారత స్వాతంత్ర్యం తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలు మరింత మెరుగుపడినట్లు చెప్పారు. రాఫేల్ ఇండక్షన్ కార్యక్రమంలో ఫ్రాన్స్ రక్షణ మంత్రి ఫ్లోరెన్స్ పాల్గొనడం రెండు దేశాల మధ్య బలమైన రక్షణ భాగస్వామ్యాన్ని గుర్తు చేస్తోందన్నారు. ప్రపంచ శాంతి కాంక్షతోనే తాము తమ రక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు రాజ్‌నాథ్ తెలిపారు. శాంతియుత వాతావరణాన్ని దెబ్బతీసే విధంగా తాము ఎప్పుడూ ప్రవర్తించబోమన్నారు.



అంబాలా ఎయిర్‌బేస్‌లో రాఫెల్ యుద్ధ విమానాల ఇండక్షన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్

# తెలుగు రాష్ట్రాల్లో వాతావరణ మార్పులు

### ఉక్కపోతతో అల్లాడుతున్న జనం
### భారీవర్షంతో రాయ్‌చూర్ మార్గానికి గండి
### గద్వాల్-రాయ్‌చూర్ మధ్య నిలిచిపోయిన రాకపోకలు
### తీరప్రాంత రాష్ట్రాల్లో వర్షాలు పడతాయని హెచ్చరిక

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): తెలుగు రాష్ట్రాల్లో విచిత్ర పరిస్థితి నెలకొంది. గతంలో ఎప్పుడూ లేనంతగా గత మూడునాలుగు రోజుల నుంచి ప్రజలు ఉక్కపోతతో బాధపడుతున్నారు. ఇదిలావుంటే అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. జోగులాంబ గద్వాల్‌లో అర్ధరాత్రి భారీ వర్షం కురువడంతో రహదారి కొట్టుకు పోయిన ఘటన జిల్లాలోని కేటీ దొడ్డి మండలం నందిన్నె గ్రామంలో చోటు చేసుకుంది. గద్వాల నుంచి రాయచూర్ వెళ్లే ప్రధాన రహదారి నీటి ఉధృతికి కొట్టుకుపోయింది.

నందిని గ్రామం దగ్గర ఉన్న గద్వాల -రాయచూర్ వెళ్లే ప్రధాన రహదారి బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారు. బ్రిడ్జి నిర్మాణం కారణంగా తాత్కాలిక రోడ్డుపై రాకపోకలు జరుగుతు న్నాయి. కాగా, అర్ధరాత్రి నందిని గ్రామంలో భారీ వర్షం కురవడంతో తాత్కాలికంగా ఉన్న రోడ్డు నీటి ఉధృతికి కొట్టుకుపోయింది. దీంతో గద్వాల నుంచి రాయచూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. గ్రామస్తులు వ్యవసాయ బావుల వద్దకు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇకపోతే మేడ్చల్ జిల్లాలో కూడా గతరాత్రి అక్కడక్కడా వర్షాలు పడ్డాయి. సాధారణంగా వాన కాలం.. ఎడతెరపి లేని వర్షాలు కురవాల్సిన సమయం.. అయితే పరిస్థితి భిన్నంగా ఉంది. పది రోజుల ముందు వరకు కుండపోత వర్షాలు, వరదలు భయపెట్టాయి. ఇలాంటి స్థితిలో ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకున్నాయి. సాధారణం కంటే అధికంగా ఉష్ణోగ్రతలు నమోదుకావడం, ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పదిరోజులుగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఐదు రోజులుగా అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గాలిలో తేమశాతంలో కూడా భారీ హెచ్చుతగ్గులు నమోదవుతుండటం ఉక్కపోతకు కారణమవుతోంది. పగలు, రాత్రి తేడాలేకుండా తేమశాతం సాధారణం కన్నా అధికంగా నమోదవుతోంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు.

కొన్ని రోజులుగా గాలిలో తేమశాతం పెరుగుతోంది. వారం రోజులుగా పగలు 45 నుంచి 50 శాతం, వేకువజాము 80 నుంచి 85 శాతం తేమ నమోదవుతోంది. కొన్నిప్రాంతాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు 39 డిగ్రీల వరకు నమోదుకావడం ఆందోళన కలిగిస్తోంది. ఎయిర్ కండీషనర్ల వాడకంతో కరోనా వ్యాపిస్తుందనే వార్తలతో జనం ఏసీల వాడకాన్ని తగ్గించారు. ఎండలు, ఉక్కపోత ఉన్నా కొందరు ఏసీల జోలికి వెళ్లడం లేదు. ఉక్కపోతతో వృద్ధులు, పిల్లలు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. మారిన వాతావరణంతో వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎండతో పాటు ఉక్కపోత

తీరప్రాంతాల్లో వర్షాలు: ఐఎండి

పెరిగిందని, వర్షాలు పడితే వాతావరణం చల్లబడు తుందని అధికారులు అంటున్నారు.

గురువారం నుంచి శనివారం వరకు రాష్ట్రంలోని తీరప్రాంతాలలో అధిక వర్షాలు పడే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ముఖ్యంగా దక్షిణ కర్ణాటక, కేరళలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడతాయని తెలిపింది. దక్షిణ మహారాష్ట్ర, ఉత్తర కేరళ తీరప్రాంతల మధ్య అల్పపీడనం ఏర్పడిందని, దీని వలన గాలి దిశ, వేగంలో మార్పువస్తుందని సూచించింది. దీని ప్రభావం దేశం అంతటా ఎంతో కొంత ఉంటుందని తెలిపింది. తూర్పు కర్ణాటక తీరం-అరేబియా సముద్రం మీద తుఫాన్ ప్రభావం అధికంగా ఉంటుందని పేర్కొంది. కర్ణాటకలోని కొన్ని ప్రాంతాలు, కేరళ, అస్సాం, మేఘలయాలలో ఆరెంజ్ రంగు కేటగిరీ హెచ్చరికను భారత వాతావరణ శాఖ జారీ చేసింది. ఈ ప్రాంతాలలో విపత్తు నిర్వహణ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించింది. భారీ వరదలు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. సెప్టెంబర్ 11 నుంచి నెలాఖరు వరకు దేశంలోని పలు ప్రాంతాలలో వర్షాలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది.

# పేదలకు వరంగా కళ్యాణలక్ష్మి

యాదాద్రి భువనగిరి,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ):: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం ఎన్నో సంక్షేమ పథకాలను చేపడుతుందని భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని రహదారి బంగ్లాలో లబ్దిదారులకు ఎమ్మెల్యే కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పబ్లిక్ టాయిలెట్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో నిరుపేదల ఆడపిల్లల తల్లిండ్రులకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. కరోనాపై ప్రజలు ఆందోళనకు గురికావొద్దన్నారు. భౌతికదూరం పాటిస్తూ, మాస్కులు, శానిటైజర్ లు వాడుతూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

### ఐసోలేషన్ వాడు సందర్శన

జిల్లాలోని భువనగిరి ప్రభుత్వ ఏరియా దవాఖానలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన ఐసోలేషన్ వార్డును భువనగిరి మాజీ ఎంపీ డాక్టర్ బూర నర్సయ్య గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కరోనా విషయంలో భయపడొద్దన్నారు. కరోనా నియంత్రణ కోసం ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేసిందన్నారు. అన్ని రకాల మందులను అందజేస్తూ.. పౌష్టికాహారాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందని పేర్కొన్నారు. ఆయన వెంట టీఆర్‌ఎస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

# కోవిడ్ నిబంధనలు పాటించాల్సిందే

### -మంత్రులకు స్పీకర్ పోచారం చురకలు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): తెలంగాణ అసెంబ్లీలో మంత్రులకు స్పీకర్ పోచారం చురకలు అంటించారు. సభలో మంత్రులు ఈటల రాజేందర్, జగదీశ్‌రెడ్డి కోవిడ్ రూల్స్ పాటించకుండా పక్కపక్కనే కూర్చున్నారు. సభాసమయంలో ఈటల పక్క సీట్లో ఉన్న నో-సీటింగ్ చైర్‌లో మంత్రి జగదీశ్‌రెడ్డి కూర్చున్నారు. మంత్రులను గమనించిన స్పీకర్.. నో-సీటింగ్ సీట్‌లో కూర్చోవద్దని సూచించారు. స్పీకర్ హెచ్చరికతో వెంటనే ఈటల దగ్గర నుంచి జగదీశ్‌రెడ్డి వెళ్లిపోయారు. సభలో సభ్యులందరూ కోవిడ్ నిబంధనలు పాటించాలని స్పీకర్ విజ్ఞప్తి చేశారు. ఇదిలా ఉంటే.. అసెంబ్లీలో మంత్రి నిరంజన్ రెడ్డి స్పీచ్‌కు సహచర మంత్రులు ఈటల, ఎర్రబెల్లి అడ్డువడ్డారు. ప్రశ్నోత్తరాల సమయంలో పామాయిల్ సమాధానం కోసం మంత్రి నిరంజన్ రెడ్డి సుదీర్ఘ సమయాన్ని తీసుకుని మాట్లాడారు. దీంతో స్పీకర్‌కు మంత్రులు ఈటల, ఎర్రబెల్లి సమయాన్ని గుర్తుచేశారు. ఒక్క ప్రశ్నకు ఎంత సమయం తీసుకుంటారని ప్రశ్నించారు. సహచర మంత్రులు అడ్డుచెప్పడంతో మంత్రి నిరంజన్ రెడ్డి వెంటనే స్పీచ్ ముగించారు.

# మూడు రాజధానులపై జోక్యం చేసుకోం: కేంద్రం

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): మూడు రాజధానుల అంశంపై కేంద్రం మరోసారి క్లారిటీ ఇచ్చింది. రాజధాని అంశంలో జోక్యం చేసుకోబోమంటూ ఇప్పటికే ఏపీ హైకోర్టుకు కేంద్ర ప్రభుత్వం రెండు సార్లు అఫిడవిట్ దాఖలు చేసింది. తాజాగా ఇదే అంశంపై కేంద్ర హోంశాఖ.. హైకోర్టు లో అదనపు అఫిడవిట్ దాఖలు చేసింది. మూడు రాజధానుల్లో కేంద్రం పాత్రపై మరింత క్లారిటీ ఇచ్చింది. విభజన చట్టం ప్రకారం మూడు రాజధానులు తప్పులేదని కేంద్రం తేల్చిచెప్పింది. విభజన చట్టంలో ఒకే రాజధాని ఉండాలని ఎక్కడా లేదని స్పష్టం చేసింది. మూడు రాజధానులపై కేంద్రం పాత్రపై పిటిషనర్ దోనే సాంబశివరావువి అపోహలేనని హోంశాఖ వెల్లడించింది. రాజధానికి అవసరమైన ఆర్థికసాయం చేస్తామని మాత్రమే చెప్పామని పేర్కొంది. రాజధాని లేదా రాజధానుల నిర్ణయంలో జోక్యం ఉండబోదని హైకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో కేంద్రం స్పష్టీకరించింది.

# ముస్లిం ఓటు బ్యాంక్ కోసం మమత తాపత్రయం: నడ్డా

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీది హిందూ వ్యతిరేక మనస్తత్వమని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా విమర్శించారు. ఆమె కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమని అన్నారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆ రాష్ట్ర పార్టీ నేతలనుద్దేశించి ఆయన మాట్లాడారు. ఆగస్టు 5న అయోధ్యలో రామాలయం నిర్మాణానికి భూమిపూజ జరిగినప్పుడు పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ లాక్‌డౌన్ విధించారని నడ్డా అన్నారు. అయితే జూలై 31న బక్రీద్ సందర్భంగా రాష్ట్రంలో లాక్‌డౌన్ ఎత్తివేశారని ఆయన గుర్తు చేశారు. దీని ద్వారా మమతా బెనర్జీది హిందూ వ్యతిరేక మనస్తత్వమన్నది అర్థమవుతుందన్నారు. ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకునేందుకు మమత ఈ విధంగా వ్యవహరిస్తున్నారని జేపీ నడ్డా విమర్శించారు. ఇలాంటి రాజకీయాలు అన్నివేళలా పనిచేయవని చెప్పారు.

# ఫార్మాసిటీకి అడ్డుతగులుతున్నారు

### ఇప్పటికే 9వేల ఎకరాల్లో భూసేకరణ
### -మండలిలో వెల్లడించిన మంత్రి కెటిఆర్


హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): అంతర్జాతీయంగా ప్రాముఖ్యత కలిగిన హైదరాబాద్ ఫార్మాసిటీని ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కేటీఆర్ అన్నారు. సుమారు 9వేల ఎకరాల వరకు భూసేకరణ చేశామని చెప్పారు. ప్రశ్నోత్తరాల్లో భాగంగా సభ్యులు అడిగిన ప్రశ్నకు శాసనమండలిలో మంత్రి సమాధానమిచ్చారు.

మరికొంత భూమి సేకరించాల్సి ఉందని చెప్పారు. భూసేకరణకు స్థానిక నేతలు, యువత సహకరించారని తెలిపారు. భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తున్నామని వెల్లడించారు. నష్టపోయిన భూమికి పరిహారంగా తిరిగి భూమి చెల్లించే యోచనలేదని చెప్పారు.

ఫార్మాసిటీని అడ్డుకోవడానికి కొందరు కుట్రలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పరిశ్రమల స్థాపనకోసం పె÷-దదెత్తున భూమిని సేకరించామని మంత్రి వెల్లడించారు.

డీపీఆర్‌ను అధ్యయనం చేసిన తర్వాతనే పరిశ్రమలకు భూములు కేటాయిస్తున్నామని, ఆ భూములను పరిశ్రమలు వినియోగించకపోతే వెనక్కితీసుకుంటున్నామని వెల్లడించారు.

## చరిత్రలో నేటినిజం



కం|| గేహమ్మును, దేహమ్మును
సాహసియై దేశములకు చకచకగ నిడుచున్
"మోహన మధుకర భగవత్"
కాహళ్ళమ్రోగించి నాడు కర సేవలతోన్!!

( సెప్టెంబర్ 11 మోహన్ భగవత్ జననం...)

-రాధశ్రీ

సెల్: 9494481210



# అంబులెన్స్‌లకు స్పీకర్ పోచారం జెండా

### 14 అంబులెన్స్‌లను సమకూర్చిన వరంగల్ ప్రతినిధులు
### కొల్లూరులో డబుల్ ఇళ్లను పరిశీలించిన నేతలు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా చేపట్టిన 'గిఫ్ట్ ఎ స్మైల్' కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ ఆధ్వర్యంలో..ఉమ్మడి వరంగల్ జిల్లా శాసన సభ్యులు అందించిన అంబులెన్స్‌లను శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మంత్రులు సహా శాసన సభ్యులంతా కలిసి మొత్తం 14 అంబులెన్స్ వాహనాలను సమకూర్చారు. ఇదిలావుంటే 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అంబులెన్సల కొనుగోలు కోసం రూ.41 లక్షల రూపాయల చెక్కును ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ కు అందజేశారు. కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్యేలు లక్ష్మారెడ్డి, గువ్వల బాలరాజు, జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డిని అభినందించారు. మంత్రి కేటీఆర్ తన పుట్టిన రోజు సందర్భంగా గిఫ్టులు వద్దు పేదల ముఖాల్లో చిరు నవ్వులు పూయించండని గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఆయా వాహనాలను వారి వారి నియోజకవర్గాల్లో కరోనా బాధితుల కోసం వినియోగిస్తారు. వీటిని నియోజకవర్గ కేంద్రాల్లోని వైద్యశాలలకు అప్పగిస్తారు. ఈ వాహనాల్లో ఆక్సిజన్, వెంటిలేటర్ సహా అత్యాధునిక సదుపాయాలను కల్పించారు. కరోనా బారిన పడిన సీరియస్ పేషంట్లకు అవసరమైన సదుపాయలన్నీ అందులో ఉన్నాయి. ఇకపోతే డబుల్ బెడ్ ఇళ్ల నిర్మాణంతో పేదల ఇంటికల నెరవేరతోందని స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎకకడిక్కడ శరవేగంగా ఇళ్ల నిర్మాణం సాగుతోందన్నారు. పేదలు ఆత్మగౌరవంతో బతికేలా సిఎం కెసిఆర్ ఇళ్ల నిర్మాణం చేపట్టారని మంత్రి కెటిఆర్ అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కొల్లూరులో నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇండ్లను మంత్రులు కేటీఆర్, వేముల ప్రశాంత్ రెడ్డి పరిశీలించారు. మంత్రులతో పాటు స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి కూడా ఉన్నారు. రూ.1360 కోట్లతో 15,660 డబుల్ బెడ్ రూం ఇండ్లను ఇక్కడ నిర్మించారు. నిర్మాణాలు పూర్తి కావడంతో త్వరలో పేదలకు పంపిణీ చేయనున్నారు. ఈ సందర్భంగా మంత్రులు ఇండ్లను పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.



హైదరాబాద్‌లో పాలిసెట్ ఫలితాలను విడుదల చేసిన కమిషనర్ నవీన్ మిట్టల్

# పాలిటెక్నిక్ ప్రవేశ ఫలితాలు విడుదల

### 12నుంచి 17వరకు ధ్రువీకరణపత్రాలు, సర్టిఫికెట్ల పరిశీలన

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): రాష్ట్ర పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష ఫలితాలు వెల్లడయ్యాయి. సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్‌మిట్టల్ నాంపల్లిలోని తన కార్యాలయంలో ర్యాంకులను ప్రకటించారు. కరోనా మహమ్మారి నేపథ్యంలో ఆలస్యంగా ఈ నెల 2న పరీక్ష నిర్వహించగా.. 56,814 మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్ష రాసిన అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ లో ఫలితాలను చూసుకోవచ్చని అధికారులు తెలిపారు. కాగా, ప్రవేశాల షెడ్యూల్‌ను ఇప్పటికే విద్యాశాఖ విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నెల 12న పాలిసెట్ మొదటి విడత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కానుంది. 12వ తేదీ నుంచి 17వ తేదీ వరకు ధ్రువీకరణపత్రాలు, సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత 14నుంచి18వ తేదీ వరకు పత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. 14 నుంచి 20వ తేదీ వరకు వెబ్ ఆప్షను పెట్టుకోవచ్చు. 22న విద్యార్థులకు సీట్ల కేటాయిస్తారు. సీట్లు సొందిన అభ్యర్థులు ఈ నెల 22 నుంచి 26 వరకు ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ నెల 30 నుంచి పాలిసెట్ తుది విడుత ప్రవేశాల ప్రక్రియ జరుగనుంది. 30న, అక్టోబర్ 1న వెబ్ ఆప్షన్‌లు ఇచ్చుకోవాలి ఉంటుంది. అక్టోబర్ 3న తుది విడుత ప్రవేశాలకు సంబంధించి సీట్లను కేటాయిస్తారు. 7వ తేదీ నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ప్రైవేటు కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల కోసం 8న మార్గదర్శకాలు జారీ చేయనున్నారు.

# వైద్యారోగ్యానికి ప్రాధాన్యం : ఈటెల

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): వైద్యవిద్యతో పాటు, వైద్యానికి తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. విమర్శలు చేస్తున్న వారు నిజాలను కూడా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధనలతోనే సంగారెడ్డి పట్టణానికి వైద్యకళాశాల ఆలస్యమవుతున్నదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ చెప్పారు. శాసన సభలో విపక్ష సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. పేదవారికి నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. సీఎం కేసీఆర్ ప్రణాళికలతో ప్రభుత్వ వైద్యంలో సమూల మార్పుల వచ్చాయని తెలిపారు. 50 నెలల్లోనే ఆరు వైద్యకళాశాలలు తీసుకువచ్చామని చెప్పారు. సర్కారీ వైద్యం మార్పులు తీసుకువచ్చేందుకు నిరంతరం ప్రయత్నిస్తూనేఉంటామని తెలిపారు. ప్రతి జిల్లాకు వైద్య కళాశాలతో పాటు, వైద్యుల పోస్టులను భర్తీ చేస్తున్నామని అన్నారు.

# కాశ్మీర్‌లో ఇద్దరు జైషే ఉగ్రవాదుల అరెస్ట్

శ్రీనగర్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): జమ్ముకశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో ఇద్దరు జైషే మహమ్మద్ ఉగ్రవాదులను భద్రతా దళాలు అరెస్టు చేశాయి. వారి నుంచి భారీగా ఆయుధాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వర్తించడానికి, యువతను ఉగ్రవాద సంస్థలో చేర్చుకోవడానికి సోపోర్ ప్రాంతానికి చెందిన ఇద్దరు జైషే ఉగ్రవాదులు కుప్వారాలో పర్యటించనున్నారనే సమాచారం పోలీసులు అందింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, 47 రాష్ట్రీయ రైఫిల్స్ బలగాలు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశాయి. ఈ సందర్భంగా కుప్వారాలోని ద్రుగ్‌ముల్లా సమీపంలో ఉన్న ఎఫ్‌సీఐ గోదాం వద్ద కారును తనిఖీ చేశారు. అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు జైషే ఉగ్రవాదులను అరెస్టు చేశారు. వారిని సోపార్లోని అరంపోరాకు చెందిన వసీమ్ ఇర్షాద్ గన్రూ (23), బాద్‌షాకు చెందిన మెహ్రాజుద్దీన్ వణీగా (21)గా గుర్తించారు. వారిద్ద రూ.7 లక్షల నగదు, ఏకే-47 రైఫిల్, మ్యాగజైన్, రెండు గ్రనేడ్లు, 30 రౌండ్ల బుల్లెట్లను స్వాధీనం చేసుకున్నారు.

# వీరనారి చాకలి ఐలమ్మ: ఎర్రబెల్లి నివాళి

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్‌ఎన్‌ఎ): చాకలి ఐలమ్మ పోరాటస్ఫూర్తిని మరువలేమని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఆమె వీరనారి అన్నారు. తెలంగాణ రైతాంగ సాయిధ పోరాట యోధురాలు..నిజాం పాలన, విస్నూరు దేశ్‌ముఖ్‌కి వ్యతిరేకంగా పోరాడిన వీరనారి చాకలి ఐలమ్మ వర్ధంతి సందర్భంగా ఐలమ్మ చిత్రపటానికిమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ..దోపిడీ, పీడనలకు వ్యతిరేకంగా పోరాడిన గొప్ప యోధురాలు చాకలి ఐలమ్మ అన్నారు. ఆనాటి ఉద్యమమే మలి దశ తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి అయ్యిందని తెలిపారు. చాకలి ఐలమ్మ ధైర్యం, తెగువ చూపుతూ రజాకార్ల గుండెల్లో భయం పుట్టించింది. ఒకవైపు సాయుధ పోరాటం చేస్తూనే మరోవైపు అమ్మలాగా ఉద్యమకారులకు అన్నం పెట్టిన మహనీయురాలు ఐలమ్మ అన్నారు. ఆమె నా నియోజకవర్గ ప్రాంతంలో జన్మించడం నా అదృష్టంగా భావిస్తున్నానని మంత్రి తెలిపారు.

# విద్యుత్ మీటర్ల అలజడి

నేటి నిజం
శుక్రవారం 11-9-2020

అధిక శాతం ప్రజల జీవనాధారామైన వ్యవసాయరంగం పట్ల,రైతుల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు ఇప్పటికే ఉండగా..తాజాగా వ్యవసాయ విద్యుత్‌కు మీటర్ల బిగింపు ఇప్పుడు చర్చనీయాంశంగా..ఆందోళనకరంగా మారింది. ఏపిలో దీనికి సంబంధించిన అలజడి రేపు తెలంగాణకు కూడా రాకతప్పదు. విద్యుత్ నియంత్రణ బిల్లుకు నడుం బిగించిన కేంద్రం రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తోందన్న విమర్శలు ఉన్నాయి. విద్యుత్ నియంత్రణ అంతా ఇక కేంద్రం చేతిలోకి వెళితే రాష్ట్రాలపై విద్యుత్ భారం తడిసి మోపెడు కానుంది. అదనపు అప్పులు తెచ్చుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రాలపై ఒత్తిడి పెంచింది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగించాలన్న జగన్ ప్రభుత్వ నిర్ణయం అలజడికి దారితీస్తున్నది. అయితే ఇదంతా కేంద్రం ఒత్తిడి మేరకే అన్నది అందరికీ తెలిసిందే. అయినా విపక్ష టిడిపి దీనిపై విమర్శలు గుప్పిస్తూనే ఉంది. రేపు తెలంగాణకు కూడా ఇదే దుస్థితి వస్తుంది. అయితే విద్యుత్ బిల్లును వ్యతిరేకిస్తామని సిఎం కెసిఆర్ గతంలోనే ప్రకటించారు. భూమ్యాకాశాలను ఏకం చేస్తామన్నారు. ఇక కొత్తగా ప్రతిపాదించిన నగదు బదిలీ ప్రకారం ఒక్కో రైతు వ్యవసాయానికి ఎంత వాడుతున్నది ఖచ్చితంగా లెక్కగట్టి ఆ సొమ్మును తన ఖాతాకు బదలాయించి నగదుగా జమచేయాలన్నది ఈ పథకం ఉద్దేశ్యం. ఎన్టీఆర్ శ్లాబ్ రేటు పెట్టిన ఫలితంగా 1984లో అదృశ్యమైన విద్యుత్ మీటర్లు జీవో నెం 22 ద్వారా మళ్లీ ద్వారాలు తెరుచుకోబోతున్నాయి. స్మార్ట్‌గా ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడతాయనే ఆందోళన రైతులు అందరిలో వుంది. రైతులపై ఒక్క రూపాయి కూడా భారం మోపబోమని ముప్పై ఏళ్ల ఉచితాన్ని కొనసాగించే సత్తా వుందని ముఖ్యమంత్రి జగన్ ఇతర మంత్రులు చెబుతున్నా ప్రశ్నలు మాత్రం అలాగే వున్నాయి. ఇప్పుడు ఈ మీటర్ల ప్రవేశ పెట్టడానికి కారణం కేంద్రంలోని మోదీ ప్రభుత్వ షరతు తప్ప రాష్ట్రం ఇచ్ఛికంగా చేస్తున్నది కాదు. మొత్తంగా చెప్పాలంటే సజావుగా సాగిపోతున్న ఉచిత వ్యవసాయ విద్యుత్‌లో అనేక మెలికలు ఏర్పడు తున్నాయి. ఇవన్నీ మే 17న కేంద్రం రాసిన లేఖలోని షరతుల ప్రభావమని రాష్ట్రప్రభుత్వం స్పష్టంగా చెబుతున్నది. అలాంటప్పుడు రేపు ఆ షరతులు మరింత బిగుసుకుంటాయా మరెన్ని కొత్త ఆంక్షలు చేరతాయో ఎవరు చెప్పగలరు? ముఖ్యమంత్రి జగన్ రూపాయి భారం పడబోదని చెబుతున్నారు. రాజకీయంగా కొత్త విద్యుత్ విధానాన్ని వ్యతిరేకించిన తెలంగాణ కూడా స్మార్ట్ మీటర్లను తెప్పించక తప్పని పరిస్థితి ఏర్పడబోతోంది. కేంద్రం ఒత్తిడి క్షేత్రస్థాయిలో రైతు అలజడికి కారణమవుతున్నది. ఇదంతా ఉచిత విద్యుత్ నుంచి దశలవారీగా తప్పుకునేందుకే అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదే విషయాన్ని విపక్షాలు కూడా అంటున్నాయి. నగదుబదిలీ పథకం పేరుతో ఉచిత విద్యుత్తుకు వెన్నుపోటు పొడుస్తోందని వైసిపి ప్రభుత్వం అనుసరిస్తోందని టిడిపి అంటోంది. కేంద్రం షరతులను వ్యతిరేకించాల్సింది పోయి రాష్ట్ర ప్రభుత్వం ఇలా మెతక వైఖరి అవలంబిస్తూ రైతు ప్రయోజనాలను పణంగా పెట్టడం సమర్థనీయం కాదని ఆందోళన వ్యక్తం చేసింది. విద్యుత్ ఉచితం అంటూనే రైతులపై అదనపు భారాన్ని మోపబోతోంది. ఇకపై వ్యవసాయ విద్యుత్ బిల్లులను రైతులు తమ జేబుల నుంచే చెల్లించాల్సిన పరిస్థితి రాబోతోంది. రాష్ట్రంలో వ్యవసాయ పంప సెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు వైసిపి ప్రభుత్వం సిద్ధమైంది. స్మార్ట్ మీటర్ల బిగింపునకు అవకాశంలేని చోట ఇన్ఫ్రారెడ్ సమాచార ప్రామాణికం కలిగిన మీటర్లను ఏర్పాటు చేయబో తున్నారు. ఈ మీటర్ల బిగింపుతో పాటు బిల్లుల చెల్లింపును తొలుత రైతులే భరించాలి, ఆ తర్వాత వ్యవసాయ విద్యుత్ బిల్లుల మొత్తాన్ని నగదు బదిలీ పథకం కింద రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికోసం ప్రత్యేకంగా రైతుల పేరుతో కొత్తగా బ్యాంకు ఖాతాలను తెరవాలని సూచించింది. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరాలో కొత్తగా తెచ్చిన సంస్కరణలపై ఇంధన శాఖ కార్యదర్శి జీఓఎంఎస్ నంబరు 22 ద్వారా మార్గదర్శకాలను విడుదల చేశారు. ప్రత్యేకంగా ఏపీ హరిత ఇంధన కార్పొరేషన్‌ను ఏర్పాటు చేశామని, ఈ మీటర్ల ద్వారా ప్రతి నెలా వచ్చే బిల్లును తామే చెల్లిస్తామని జీఓలో వెల్లడించారు. ఇలా వెల్లడిస్తూనే, మరోప్రక్క వ్యవసాయ పంపుసెట్లు ఏ నెలలో ఎంతెంత కరెంటు కాల్చుకొనే అవకాశం వుందో ప్రభుత్వం లెక్కగట్టింది. ఆ అంచనా ప్రకారం ఇప్పుడు ఉన్న పంపు సెట్లు ఏడాదికి 12 వేల మిలియన్ యూనిట్ల విద్యుత్తు వాడే అవకాశం వుందని, ఆ విధంగా ఏటా రూ.8,400 కోట్ల సబ్సిడీని ప్రభుత్వం భరిస్తోందని, ఆ మొత్తాన్ని నెలవారీ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో వేస్తుందని జీఓలో వెల్లడించారు. కానీ అంతకుమించి వాడకం పెరిగితే ఆ భారం ఎవరు భరించాలన్నది మాత్రం చెప్పడంలేదు. అసలు విద్యుత్తు పంపిణీ సంస్థలకే సబ్సిడీ డబ్బులు సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం భవిష్యత్తులో రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు వేస్తుందనే గ్యారంటీ ఏమిటన్న ప్రశ్న కూడా ఉదయిస్తుంది. ఉచిత విద్యుత్తు రైతుల హక్కుగా సాధించుకున్నారు. దానిని నగదు బదిలీ పేరిట ప్రభుత్వ దయాదాక్షిణ్యాలపై ఆధారపడేవిధంగా మార్చి సంక్షేమ పథకాల సరసన చేర్చడంలో కేంద్రం ఒత్తిడి దాగి ఉంది. అసలే సంక్షోభంలో ఉన్న రైతాంగాన్ని నగదు బదిలీ పథకం ద్వారా మరింత సంక్షోభంలోకి నెడుతుంది. ఇప్పటి వరకు వ్యవసాయం కోసం అందజేస్తున్న ఉచిత విద్యుత్తుకు ప్రభుత్వం ఎలాంటి బిల్లులను వసూలు చెయ్యడం లేదు. ఇకపై మాత్రం రైతులు విద్యుత్ బిల్లులను చెల్లించాల్సిందే. ఆ బిల్లుల మొత్తాన్ని రైతుల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని చెబుతున్నప్పటికీ మున్ముందు ఈ పథకానికి ప్రభుత్వం నుంచి ముప్పు ఉండదని చెప్పే పరిస్థితి లేదు. వ్యవసాయ విద్యుత్తుకయ్యే ఖర్చంతా ఇకపై ప్రభుత్వమే భరిస్తుంద న్నప్పుడు ఈ విద్యుత్ మీటర్ల కసరత్తంతా ఎందుకన్న అనుమానాలు బలపడుతున్నాయి.

## గుత్తాతో టిఎన్జీవో నేతల భేటీ

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డిని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం(టీఎన్జీఓఏ) నూతన అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధానకార్యదర్శి రాయకంటి ప్రతాప్ ఆధ్వర్యంలో పలువురు సంఘం నేతలు బుధవారం కలిసారు. సంఘం మాజీ అధ్యక్షులు కారం రవీందర్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి ఇటికాల కొండల్ రెడ్డితదితరులు కూడా ఛైర్మన్‌ను కలిసిన ఉద్యోగ నేతల బృందంలో ఉన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మామిళ్ళరాజేందర్ మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడంలో సహాయం చేయాలని మండలి ఛైర్మన్‌ను కోరారు. ఇందుకు ఛైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు రాజేందర్ తెలిపారు. ఛైర్మన్ మాట్లాడుతూ... ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇక సంఘం మాజీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఇప్పటివరకు ఉద్యోగులకు మాత్రమే మీ సేవలనందించారని, ఇకపై ప్రభుత్వం ద్వారా ప్రజలకు కూడా సేవలనందించాలని కోరారు.

## నిలకడగా ఎస్పీ బాలు ఆరోగ్యం

చెన్నై,సెప్టెంబర్ 10(ఆర్ఎన్ఎ): ఇటీవల కరోనా మహమ్మారి బారినపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యం నిలకడగానే ఉన్నదని వైద్యులు తెలిపారు. సోమవారం ఆయనకు మరోసారి కరోనా నిర్ధారణ పరీక్షలు చేయగా నెగెటివ్ వచ్చింది. అయితే ఇన్నాళ్ల అనారోగ్యం కారణంగా ఆయన బాగా నీరసించిపోయారని, అందుకే చికిత్స అందిస్తున్నామని ఎంజీఎం ఆస్పత్రి డాక్టర్లు చెప్పారు. ఈ మేరకు హెల్త్ బులెటిన్ విడుదల చేశారు. ప్రస్తుతం బాలసుబ్రహ్మణ్యం చికిత్సకు స్పందిస్తున్నారని హెల్త్ బులెటిన్‌లో వైద్యులు పేర్కొన్నారు. వెంటిలేటర్, ఎక్మో సాయంతో చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే ఆయనకు వెంటిలేటర్ తీసేయాలని వైద్యులు భావిస్తున్నట్లు ఎస్పీ బాలు తనయుడు చరణ్ చెప్పారు. కరోనా పాజిటివ్ రావడంతో ఎస్పీ బాలు ఆగస్టు 5న చెన్నైలోని ఎంజీఎం ఆస్పత్రిలో చేరారు. ఆ తర్వాత కొన్నిరోజులకే పరిస్థితి విషమించడంతో ఐసీయూకి తరలించి వెంటిలేటర్ అమర్చారు. తర్వాత ఆయనకు ఎక్మో సాయం అందిస్తూ వచ్చారు. దాంతో ప్రస్తుతం ఆయన కోలుకున్నారు. ప్రస్తుతం ఆయన పూర్తిగా స్పృహలోనే ఉన్నారని ఎంజీఎం ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. ఊపిరితిత్తుల పనితీరు కూడా మెరుగుపడినట్లు తెలిపారు.

## నిధుల దుర్వినియోగం: మహిళా సర్పంచ్ సస్పెన్షన్

భద్రాద్రి కొత్తగూడెం,సెప్టెంబర్ 10(ఆర్ఎన్ఎ): సీతారాంపురం పంచాయతీ సర్పంచ్ సున్నం సుశీల ఇసుక క్వారీల ద్వారా వచ్చిన డబ్బును తన వ్యక్తిగత ఖాతాలో వేసుకుంటుందని వార్డు సభ్యులు ఆమెపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం ఆమెను ఆరు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఎంవీ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అదే జిల్లాలోని మంగపేట సర్పంచ్ సుజాత భర్త, కుమారుడు కలిసి పంచాయతీ కార్యదర్శిపై దాడికి పాల్పడినట్లు కలెక్టర్‌కు ఫిర్యాదు రావడంతో విచారణ అనంతరం సర్పంచ్ సుజాతను కూడా సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. అదే విధంగా మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం కన్నెపల్లి ఉప సర్పంచ్ దమ్మని సత్తయ్యను నిధుల వినియోగంపై సహకరించడం లేదని సర్పంచ్ ఫిర్యాదు మేరకు సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ భారతి తెలిపారు.

## రెవెన్యూశాఖలో నవశకానికి నాంది

### సంస్కరణలకు నాంది అంటూ హరీష్ ట్వీట్

### సర్వత్రా ప్రజల్లో హర్షం

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): శాసనసభలో ముఖ్యమంత్రి కే. చంద్రశేఖర్ రావు కొత్త రెవెన్యూ చట్టం బిల్లును ప్రవేశపెట్టడంపై ఆర్థిక మంత్రి హరీశ్‌రావు హర్షం వ్యక్తం చేశారు. రెవెన్యూశాఖలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణలు నవశకానికి నాంది అని పేర్కొన్నారు. అవినీతి, ఆలస్యం బాధల నుండి పేద ప్రజలు, రైతులకు విముక్తి కల్పించే చారిత్రక చట్టంగా తెలంగాణ నూతన రెవెన్యూ చట్టం దేశానికే దశదిశ చూపనుంది. రెవెన్యూలో సీఎం కేసీఆర్ చేపట్టిన సంస్కరణలు రాష్ట్రంలో నవశకానికి నాంది పలుకనున్నాయి. ముఖ్యమంత్రి కేసీఆర్ గారికి కృతజ్ఞతలు' అంటూ హరీశ్ రావు ట్వీట్ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో నవశకానికి నాంది పలుకుతూ సీఎం కేసీఆర్ తీసుకున్నసాహసోపేత నిర్ణయానికి జనం జేజేలు పలుకు తున్నారు. వీఆర్వో వ్యవస్థను రద్దు చేసి.. కొత్త రెవెన్యూ చట్టాన్ని సీఎం కేసీఆర్ శాసనసభలో ప్రవేశపెట్టడం పట్ల రాష్ట్ర వ్యాప్తంగా సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. భూ సమస్యల పరిష్కారం కోసం ఇన్నాండ్లు అరిగోస పడ్డ ప్రజలు ఇక తమ కష్టం తీరినట్లేనని సంతోష పడుతున్నరు. ఊరూరా వాడవాడలా సీఎం కేసీఆర్ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్నరు. పటాకులు కాల్చి, స్వీట్లు పంచుకొని వేడుకలు జరుపుకుంటున్నరు. భారీ ర్యాలీలు నిర్వహిస్తూ కేసీఆర్ కు మద్దతుగా నిలుస్తున్నరు. సీఎం కేసీఆర్ సల్లంగా ఉండాలని దీవెనలు అందిస్తున్నరు. రాష్ట్రంలో నూతన రెవెన్యూ చట్టం తీసుకరావడంతో టీఆర్ఎస్వీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో.. ఆర్ట్స్ కళాశాల ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త రెవెన్యూ చట్టంతో ప్లలెల్లో పండుగ వాతావరణం ఏర్పడిందన్నారు. ఈ చట్టంతో ప్రజలకి మేలు కలుగుతుందన్నారు. వీఆర్వో వ్యవస్థతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలతో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకెళ్తుందన్నారు.

## నూతన రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తున్నాం: పద్మాచారి

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రజలకు అనుగుణంగా ఉండే నూతన రెవెన్యూ చట్టాన్ని స్వాగతి స్తున్నట్లు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఏ. పద్మాచారి పేర్కొన్నారు. ఈ చట్టానికి రూపు తెచ్చే క్రమంలో... తెలంగాణ ఉద్యమ సమయంలోనే... నాటి ఉద్యమ నేత, నేటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు... అధ్యయనం చేశారన్నారు. బుధవారం పద్మాచారి ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. రెవెన్యూ శాఖ పై ప్రజల నుండి పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందాయని, ఈ క్రమంలోనే... కొత్త చట్టం రూపకల్పన అని పద్మాచారి అభిప్రాయపడ్డారు. రెవెన్యూ శాఖ లో ప్రజలకు అనుకూలంగా తెస్తున్న కొత్త చట్టాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కొత్త చట్టాన్ని తెచ్చే క్రమంలో... సీఎం కేసీఆర్ పలుమార్లు సమీక్షించారని పద్మాచారి వెల్లడించారు. ప్రజలకు సేవ చేయడంలో భాగంగా నే రెవెన్యూ శాఖ లో మార్పులు అనివార్యమయ్యాయన్నారు. ఉద్యోగులు కూడా ప్రజల కోసం పని చేయాలని పద్మాచారి కోరారు. ప్రభుత్వానికి, ప్రజలకు అందుబాటులో ఉండాల్సింది ఉద్యోగులేనన్నారు.

# కొత్త రెవెన్యూ చట్టంపై సమగ్ర చర్చ సాగాలి

### నేటి సమావేశాల్లో లోటుపాట్లపై దృష్టి సారించాలి

### టెక్నికల్ లోపాలు లేకుండా ధరణిని పటిష్టం చేయాలి

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం అందరికీ భరోసా దక్కుతుందని సిఎం చేసిన ప్రకటన మేరకు కొత్త చట్టం రాబోతున్నది. దీనిపై శుక్రవారం అసెంబ్లీలో చర్చ జరుగనుంది. ఈ దశలో దీనిలో ఉన్న లోటుపాట్లను చర్చించేందుకు అవకాశం ఇవ్వాలి. అలాగే లోపాలను సవరించుకునే అవకాశం ఉండాలి. ప్రభుత్వం ఈ మేరకు విస్తృతంగా చర్చించడం ద్వారా ప్రజలకు మరింతగా భరోసా కల్పించాలి. చట్టం మరింత సమర్థంగా సేవలందించాలంటే ధరణి వెబ్‌సైట్‌ను మరింత పకడ్బందీగా మార్చాల్సిన అవసరంఉంది. భూముల సర్వే చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. పెండింగు కేసుల కోసం ఏర్పాటు చేస్తున్న ట్రిబ్యునళ్లను పర్మినెంట్ చేస్తే బాగుంటుంది. ట్రిబ్యునల్‌కు వెళ్ళిన పేదవారికి ఉచితంగా న్యాయసహాయం అందించే వెసలుబాటు ఉండాలి. వ్యవసాయ భూమైనా, వ్యవసాయేతర భూమైనా ప్రజల చేతుల్లోకి వచ్చే పట్టాకు ప్రభుత్వమే జిమ్మేదార్‌గా ఉండేలా చట్టంలో ఉంటే చరిత్రలో తెలంగాణ పేరు శాశ్వతంగా ఉండిపోతుంది. చట్టం ప్రజల చుట్టం కావాలన్న సూత్రం నూతన రెవెన్యూ చట్టానికి సరిగ్గా సరిపోతుంది. సిఎం కెసిఆర్ ఇచ్చిన భరోసా కూడా ఇదే అవకాశాన్ని కల్పిస్తుంది. కొత్త చట్టం ద్వారా ప్రభుత్వం చేసిన నాలుగు కీలకమైన మార్పులతో సామాన్యులకు, రైతులకు కొండంత ధైర్యం లభిస్తుందని తెలిపారు. కంప్యూటరీకరణ, భూమి చేతులు మారినపుడు చేయాల్సిన ప్రక్రియ, స్లాట్ బుకింగ్, వివాదాల పరిష్కారమే ప్రభుత్వం తీసుకొచ్చిన భారీ మార్పులని వెల్లడించారు. రికార్డులన్నీ కంప్యూటర్‌లో నిక్షిప్తం చేయడం వల్ల పాత రికార్డులను మార్చలేరని దాని వల్ల వివాదాలకు ఆస్కారముండదని పేర్కొంటున్నారు. ధరణిలో ఉన్న 1బీ రికార్డే ఫైనలవుతుందని చెప్పారు. పాతచట్టం ప్రకారం భూమి చేతులు మారాలంటే కనీసం రెండు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్ళాల్సి ఉండేదని, కొత్త చట్టంలో ఇదంతా మార్చేసి సింగిల్ విండో పద్ధతిని తీసుకొచ్చారని ఆయన వివరించారు. వ్యవసాయ భూములైతే తాసిల్దారు, వ్యవసాయేతర భూములైతే సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళతారని, వారే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసి కాగితాలు ఇస్తారన్నారు. 1బీ లోనూ వెంటనే మార్పులు జరుగుతాయని కెసిఆర్ తెలిపారు. పాస్‌పోర్టు కోసం స్లాట్ బుక్ చేసుకున్న ట్టుగానే ప్రజలకు వీలైన స్లాట్ బుక్ చేసుకుని వెళ్ళి రిజిస్ట్రేషన్ చేసుకొనే సదుపాయం కొత్త చట్టంలో కల్పించడం మంచి పరిణామం. ఆర్వోఆర్ చట్టం కింద ఉన్న వివాదాలు, తప్పులను సరిదిద్దడమనే అధికారాలను రెవెన్యూ అధికారుల నుంచి తొలగించి ఆ కేసులన్నింటినీ ట్రిబ్యునళ్లకు అప్పగించడం వల్ల నిర్ణీత సమయంలో కేసులు పరిష్కారమవుతాయన్న భరోసా వచ్చింది. మొత్తంగా కొత్త చట్టం ప్రకారం రాష్ట్రంలో భూ సమస్యలన్నింటికీ పరిష్కారంగా ధరణి పోర్టల్ పనిచేస్తుంది. ఇదే దశలో ధరణి పోర్టల్ పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలి. అన్నింటికీ మూలం ఇదే అనుకున్నప్పుడు సాంకేతికంగా చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. బ్యాకప్ మెకానిజం లేదా డిజాస్టర్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీలో ఉండాలి.

ఇది మన రాష్ట్ర మొత్తం భూభాగం అనే విధంగా ధరణిని పటిష్టం చేస్తే అంతకన్నా అదృష్టం ఉండదు. ప్రభుత్వ భూములు, గ్రామకంఠం అని క్యాటగిరీలు ఉంటాయి. పట్టణాల కింద ఉండే భూమి, పబ్లిక్ యుటిలిటీస్ పేరిట భూమి అనేక రూపాల్లో ఉంటుంది. మొత్తం మీద ఒకటి వ్యవసాయ భూమి, రెండు అటవీ భూమి, మూడు వ్యవసాయేతర భూమిగా మన రాష్ట్రంలో భూములున్నాయన్నది ఇక ధరణితో స్పష్టం కాబోతున్నది.

# మహారాష్ట్రలో మళ్లీ ఆటవిక చర్యలు

### శివసేనకు ఎదురు తిరిగితే అంతేనా

### నటి కంగనా వ్యవహారంలో ఎందుకీ కక్ష

ముంబై,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో మళ్లీ బాలథాకరే నాటి ప్రజాస్వామ్యం పరిడవిల్లుతోందా అన్న అనుమానాలు బలపడుతున్నాయి. ప్రజాస్వామ్యయుతంగా ఓ అంశంపై గొంతెత్తితే నటి కంగనారనౌత్ కార్యాలయాన్ని కూల్చేయడం ఆటవిక చర్య తప్ప మరోటి కాదు. తమకు ఎవరూ ఎదురు తిరగరాదన్న నిరంకుశ విధానం మహారాష్ట్రలో అమలువుతోందన్న దానికి ఇంతకన్నా నిదర్శనం ఉండదు. బాలీవుడ్ యువ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ జూన్ 14న అనుమానాస్పద స్థితిలో మరణించి నప్పటినుంచి రాజుకుంటున్న వివాదం అనేకానేక మలుపులు తిరిగి చివరకు మంగళవారం అతని స్నేహితురాలు, నటి రియా చక్రవర్తి అరెస్టుకు దారితీసింది. అది జరిగిన మరునాడే నటి కంగనా రనౌత్ నివాసం ఆవరణలో అనుమతుల్లేని నిర్మాణాలున్నాయంటూ బృహన్ ముంబై కార్పొరేషన్ (బీఎంసీ) కూల్చివేతలు మొదలు పెట్టింది. ముంబై హైకోర్టు ఆదేశాలతో మధ్యలో అవి నిలిచిపోవడం, ఆ విషయంలో శివసేనపై కంగనా విరుచుకుపడటం వంటి పరిణామాలన్నీ చకచకా జరిగాయి. రియా చక్రవర్తి అరెస్టుతో సుశాంత్ మరణంపై రాజుకున్న వివాదానికి తాత్కాలికంగా తెరపడిందని అందరూ అనుకునేలోగానే ఇప్పుడు కంగనా ఇంటి కూల్చివేత వివాదం ఎజెండాలో కొచ్చింది. ఈ రెండు ఉదంతాలూ పరస్పర సంబంధమైనవి కాకపోయివుంటే ఈ కూల్చివేత ఇంత ఆదరా బాదరాగా జరిగేది కాదు. అలాగే ఇంత ప్రముఖంగా చర్చకొచ్చేది కూడా కాదు. ఎందుకంటే ఇంతక్రితం షారుఖ్ ఖాన్, సోనూసూద్ వంటి బాలీవుడ్ ప్రముఖుల నివాసాల్లో సైతం బీఎంసీ అక్రమ నిర్మాణాల పేరిట కొన్నింటిని కూల్చివేసింది. అయితే ఇప్పుడే ఈ వివాదం కొనసాగుతున్న వేళ కూల్చివేతలు సాగించడం ఆటవిక రాజ్యాన్ని సూచిస్తోంది. ఇటీవలకాలంలో శివసేనపై, ముంబై మహా నగరంపై కంగనా చేస్తున్న వ్యాఖ్యానాలు ఆ పార్టీకి ఆగ్రహం కలిగిస్తున్నాయి. సుశాంత్‌సింగ్ కేసులో ముంబై పోలీసుల వ్యవహారశైలిని ఆక్షేపిస్తూ ఆ నగరాన్ని కంగనా పాక్ ఆక్రమిత కశ్మీర్‌తో పోల్చారు. ఇక్కడ జీవనం సాగించాలంటే భయంగా వుందని వ్యాఖ్యానించారు. అందుకు జవాబుగా శివసేన సైతం ఆమెపై నోరు పారేసుకుంది. దాంతో తన ప్రాణాలకు ముప్పువుందంటూ ఆమె కేంద్రానికి విన్నవించుకుని వై ప్లస్ సెక్యూరిటీ కూడా సాధించుకున్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ఎవరైనా చేసినప్పుడు శివసేన ప్రతీకారం ఏ స్థాయిలో వుంటుందో అందరికీ తెలుసు. గతంలో బాలథాకరే హయాంలో కూడా ముంబై ఎలా ఉండేదో అందరికీ అనుభవమే. తన అధికారాన్ని విని యోగించి తన చేతనైంది చేయడానికి శివసేన వెనకాడని గుర్తు చేసింది. కంగనా బంగ్లాలో కొన్ని అక్రమ నిర్మాణాలు ఉన్నాయని బీఎంసీ గతసోమవారం ఆమెకు నోటీసులు జారీ చేసింది. నిజానికి అలాంటి అక్రమాలే ఉంటే ఇంతకాలం ఎందుకు మిన్నకున్నదని చెప్పగలగాలి. ముంబై మహానగరంలో అధికారుల కుమ్మక్కు కారణంగా అనేకానేక అక్రమ నిర్మాణాలు బయల్దేరుతున్నాయని, పర్యవసానంగా వర్షాకాలంలో నగరం వరదల్లో చిక్కుకుంటున్నదని పర్యావరణవేత్తలు ఎప్పటినుంచో ఆరోపిస్తున్నారు. ఇలా నిబంధనలకు విరుద్ధంగా సాగిస్తున్న నిర్మాణాలు నగరంలో నిరుపేదలు, సాధారణ పౌరుల బతుకుల్ని నరకప్రాయం చేస్తున్నాయని వారంటున్నారు. కనుక అక్రమ నిర్మాణాలు కూల్చేయాల్సిందే. కానీ అందుకు తగిన విధివిధానాలు అనుసరించాలి తప్ప ఇష్టానుసారం చేయడం ఎవరూ హర్షించరు. ఈ తరుణంలోనే కూల్చివేత ప్రారంభించాల్సిన అగత్యం ఏమొచ్చిందో బీఎంసీ జవాబివ్వలేకపోతోంది. ఈ వివాదం మొత్తానికి మూలాలు ఎక్కడున్నాయో అందరికీ తెలుసు.

# దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులకు మరమ్మత్తులు

### వర్షాలకు 1087 కల్వర్టులు, రోడ్లు దెబ్బతిన్నాయి

### -శాసనసభలో వెల్లడించిన మంత్రి వేముల

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్రంలో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం అంచనాలు రూపొందించామని రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న రోడ్లపై శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడు తూ.. రాష్ట్రంలో దెబ్బతిన్న జాతీయ రహదారులకు ఆర్అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టామన్నారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన వర్షాలకు 1087 కల్వర్టులు, రోడ్డు భాగాలు దెబ్బతిన్నాయి. వీటన్నింటికి మరమ్మతులు చేపట్టేందుకు అంచనాలు రూపొందించామన్నారు. రాష్ట్ర రహదారుల విషయానికి వస్తే 27,521 రోడ్లు ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. 1675 కిలోమీటర్ల పొడవు గల రోడ్లలో 664 చోట్ల రోడ్లు దెబ్బతిన్నాయి. రాకపోకలకు అంతరాయం జరిగిన చోట తాత్కాలిక మరమ్మతుల కింద కోటి 23 లక్షలతో రోడ్లను వేశామన్నారు. జాతీయ రహదారుల విషయంలో రాష్ట్రంలో 3824 కిలోమీటర్ల రహదారి ఉంది. ఇందులో 1550 కిలోమీటర్లు ఆర్ అండ్ బీ పరిధిలో ఉండగా, 2273 కిలోమీటర్ల రహదారులు ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ఉన్నాయి. ఆర్ అండ్ బీ పరిధిలో ఉన్న రోడ్లకు మరమ్మతులు చేపట్టాం. కానీ ఎన్‌హెచ్ఏఐ పరిధిలో ఉన్న రోడ్లకు నిధులు మంజూరు చేయడం లేదు. కాబట్టి కాస్త ఇబ్బంది కలిగిందన్నారు. రోడ్ల మరమ్మతులకు సంబంధించిన నివేదికను త్వరలోనే తెప్పించుకుంటామని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఇదిలావుంటే శాసనసభ సమావేశాలకు సభ్యులందరూ సహకరించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. సభ ప్రారంభమైన వెంటనే స్పీకర్ మాట్లాడుతూ.. బీఏసీ నిర్ణయం ప్రకారం గంటపాటు ప్రశ్నోత్తరాలు, అర గంట పాటు జీరో అవర్ ఉంటుంది. గంటలోపే ప్రశ్నోత్తరాలు ముగించాలి. ప్రశ్న అడిగే వారు, సమాధానం చెప్పేవారు సూటి అడిగితే బాగుంటుంది. దీనికి గౌరవ సభ్యులందరూ సహకరించాలి. కరోనాపై కూడా చర్చ ఉందికాబట్టి సభ్యులు గమనించాలని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## హిందూ ధర్మంపై కుట్రలు : శ్రీరామ్‌సేన అధ్యక్షుడు తురగా శ్రీరామ్

విశాఖపట్నం,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): అంతర్వేది రథం దగ్ధం పిచ్చివాళ్ల చర్యని తప్పించుకుంటారా?..అని శ్రీరామ్‌సేన అధ్యక్షుడు తురగా శ్రీరామ్ మండిపడ్డారు. అలా చెప్పి హిందువులను పిచ్చివాళ్లను చేద్దామనుకుంటున్నారా అంటూ మండిపడ్డారు. హిందూ ధర్మంపై జరుగుతోన్న కుట్రలు ఆగకపోతే కరసేవకులకు పిలుపునిస్తామన్నారు. అఘోరాలు, నాగసాధువులను రప్పించి హిందూ దేవాలయాలను రక్షించుకుంటామని వెల్లడించారు. దేవాలయాలను కాపాడుకునేందుకు ఎంతదూరమైనా వెళతామని శ్రీరామ్ తెలిపారు. హిందూ దేవాలయాల పరిరక్షణపై దేవాదాయశాఖ మంత్రి బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. హిందూ ధార్మిక సంస్థల తరుపున రావడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. చర్చకు రాకపోతే.. మంత్రి రాజీనామా చేయాలని తురగ శ్రీరామ్ పేర్కొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మేయర్ తదితరులు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): తిరుమల శ్రీవారిని గ్రేటర్ హైదరాబాద్ మేయర్ బొంతు రామ్మోహన్, సివిల్ సప్లై ఛైర్మన్ శ్రీనివాస రెడ్డి, టీఎస్ఐఐసీ ఛైర్మన్ బాలమల్లు, ఎమ్మెల్సీ కరణం ప్రభాకర్ దర్శించుకున్నారు. ఇవాళ ఉదయం వీరు స్వామి వారికి జరిగే నైవేద్య విరామ సమయంలో స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మేయర్ బొంతు రామ్మోహన్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రజల కోసం రాష్ట్రంలో ఎన్నో పథకాలను ప్రవేశ పెట్టి అమలు చేస్తున్నారన్నారు. నూతన రెవెన్యూ చట్టం ద్వారా నిరుపేదలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఆలోచన చేసిన సీఎం కేసీఆర్ కు జనం సర్వత్రా ఆమోదం తెలుపుతున్నారని పేర్కొన్నారు.

## 90శాతం పూర్తయిన మక్కామసీదు పనులు: కొప్పుల ఈశ్వర్

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): మక్కామసీదు మరమ్మతు పనులు ఇప్పటికే 90 శాతం పూర్తయ్యాయని మంత్రి కొప్పుల ఈశ్వర్ మండలిలో చెప్పారు. ఎంతో పురాతనమైన మక్కా మసీదు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. పనులను త్వరలోనే పూర్తిచేయడానికి ప్రయత్నిస్తామని చెప్పారు. మక్కామసీదు మరమ్మతుకు సంబంధించి సభ్యులు అడిగిన ప్రశ్నకు శాసనమండలిలో మంత్రి సమాధానమిచ్చారు. మక్కామసీదుకు నాలుగు వందల ఏండ్ల చరిత్ర ఉన్నదని చెప్పారు. చారిత్రక ప్రాధాన్యం కలిగిన మసీదు మరమ్మతుల కోసం రూ.8 వేల కోట్లు కేటాయించమాని చెప్పారు. కరోనా నేపథ్యంలో మక్కా మసీదు పనుల్లో కొంత జాప్యం జరిగిందని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం సెక్యులర్ ప్రభుత్వమని, అన్ని మతాలను గౌరవిస్తుందని అన్నారు.

## ఆక్సిజన్ ప్లాంటును పరిశీలించిన కలెక్టర్

ఖమ్మం,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ఖమ్మం నగరంలోని ప్రభుత్వ దవాఖానలో నిర్మించనున్న ఆక్సిజన్ లిక్విడ్ ప్లాంటును కలెక్టర్ ఆర్ వీ కర్ణన్ గురువారం పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు అవసరమైన ఆధునిక పరికరాలను అందుబాటులో ఉంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన చెప్పారు. కరోనా నియంత్రణలో భాగంగా ఈ దవాఖానలో ఐసోలేషన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వైద్యులను నిరంతరం అందుబాటులో ఉంచినట్లు వివరించారు. దవాఖానలో మాత శిశుసంక్షేమ కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఆధునిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు.

## యూరియా కొరతపై కలెక్టర్‌కు వినతి

ఆసిఫాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రాణహిత పరీవాహక గ్రామాల్లో ముంపునకు గురైన పత్తి పంటలను కలెక్టర్ సందీ ప్ కుమార్ ఝాపరిశీలించారు. నష్టపోయిన రైతులకు పరిహారం ఇప్పించేలా కృషి చేస్తానని ఆయన అన్నారు. మండలంలో చేపడుతున్న రైతు వేదిక నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. గ్రామాల్లో చేపడుతున్న రైతువేదిక నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు యూరియా సరిపోవడం లేదని ఇంకా వెయ్యి మెట్రిక్ టన్నులు కావాలని కలెక్టర్‌ను కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి యూరియా సరఫరా చేయిస్తానని హామీ ఇచ్చారు. కుకుడలో కరెంట్ సరిగా ఉండడం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన ఆయన కౌటాలలో టవర్‌లైన్‌తో సబ్‌స్టేషన్ కోసం ప్రతి పాదనలు పంపించడంతో పాటు ఎమ్మెల్యే కోనప్పతో చర్చించినట్లు తెలిపారు.

## యాదాద్రిలో భక్తుల దర్శనాలు నిలిపివేత

### బోసిపోయిన ఆలయ పరిసరాలు

### అంతరాలయంలో నిత్యపూజలకే పరిమితం

యాదాద్రి,సెప్టెంబర్9(ఆర్ఎన్ఎ): కరోనా విజృంభిస్తున్న కారణంగా దేవాదాయ శాఖ ఆదేశాలతో యాదాద్రిలో మూడు రోజులు పాటు ఆలయంలో భక్తుల దర్శనాలను రద్దు చేయడంతో పూజలు అంతరాలయానికే పరిమితం అయ్యాయి. కేవలం పూజారులు నిత్యపూజలతో సరిపుచ్చారు. భక్తులకు అనుమతి నిరాకరించారు. కొండ మీద, కింద వ్యాపార వాణిజ్య సముదాయాలు కూడా మూతపడ్డాయి. దీంతో యాదాద్రి పరిసరాలు బోసిపోయి కనిపించాయి. నిత్యం వేలాది భక్తజనంతో నిత్యకల్యాణం, పచ్చతోరణంలా కళకళ లాడే యాదాద్రి భక్తులు లేక నిర్మానుష్యంగా మారింది. స్వామివారి నిత్య కైంకర్యములు, ఆన్‌లైన్ సేవలు, ఏకాంత సేవలను భక్తులు లేకుండా అర్చకులు యథావిధిగా నిర్వహిస్తు న్నారు. కరోనా విజృంభిస్తున్న కారణంగా దేవాదాయ శాఖ ఆదేశాలతో బుధవారం నుంచి మూడు రోజులు పాటు ఆలయంలో భక్తుల దర్శనాలను రద్దు చేశారు. కొండ మీద, కింద వ్యాపార వాణిజ్య సముదాయాలు కూడా మూత పడ్డాయి. దీంతో యాదాద్రి పరిసరాలు బోసిపోయి కనిపించాయి. కరోనా మహమ్మారి ఉధృతి నేపథ్యంలో నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. అలాగే ఆన్‌లైన్ సేవలు, దర్శనాలు భక్తులకు అందుబాటులో ఉంటాయని అధికారులు చెప్పారు. అలాగే పాతగుట్ట లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోనూ దర్శనాలు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. కాగా, యాదగిరిగుట్టలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో దర్శనాలు నిలిపివేయాలని ఇప్పటికే పలు పార్టీల నాయకులు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు వినతి పత్రాలు అందజేశారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా సోమవారం దేవాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి ప్రజాప్రతినిధులు, స్థానికులు లాక్‌డౌన్ విధించాలని కోరారని విప్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అలాగే ప్రధానార్చకులతో పాటు మరో ఇద్దరు అర్చకులు, ఉద్యోగికి వైరస్ సోకవడంతో సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు మూడు రోజుల పాటు దర్శనాలు నిలిపివేయాలని అధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది.

# ప్రైవేట్ కంపెనీల ప్రయోజనం కోసమే మీటర్లు

## రైతులకు ఉచిత విద్యుత్ మంగళం పాడబోతున్నారు

### -మండిపడుతున్న విపక్ష టిడిపి

విజయవాడ,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): దాదాపు 20 ఏళ్లుగా సాఫీగా అమలవుతున్న ఉచిత విద్యుత్తు పథకానికి కొర్రీలు వెయ్యాల్సిన అవసరం ఏమొచ్చిందని టిడిపి నేత దేవినేని ఉమ ప్రశ్నించారు. ప్రైవేటు కంపెనీల ప్రయోజనం కోసమే వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని ఆరోపించారు. డిస్కమ్‌లను ప్రయివేటీకరణ చేసేందుకే ముందస్తు ప్రణాళికలో భాగంగా ఈ విధానం తెస్తున్నారని మండిపడ్డారు. దేశంలోనే విద్యుత్ సంస్కరణలను పటిష్ఠంగా అమలు చేస్తున్న తొలి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని సలహాదారు ఒకరు కితాబు కూడా ఇచ్చారు. దీనిని బట్టి కేంద్ర ప్రభుత్వం పెట్టిన షరతులను జగన్ సర్కార్ ఏమాత్రం వ్యతిరేకించకుండా వేగంగా అమలు చేస్తోందని అవగతమవుతోంది. నగదు బదిలీ పథకాన్ని డిసెంబరులోగా అమలు చేయాలని సూచించగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం సెప్టెంబర్ నుంచే అమలు చేయాలని నిర్ణయించి, అందుకు శ్రీ కాకుళం జిల్లాను ఎంపిక చేసింది. మీటర్ల బిగింపునకు ఎందుకు పరుగులు పెడుతుందో అర్థం కావడం లేదని దేవినేని అన్నారు. పొరుగున ఉన్న తెలంగాణ ప్రభుత్వం ఈ నగదు బదిలీ పథకాన్ని తిరస్కరిస్తే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాత్రం భుజానికెత్తుకుందని మండిపడ్డారు. అదనపు అప్పుకోసం కేంద్రం ఆడమన్నట్లల్లా ఆడుతూ రైతుల నోట్లో మట్టికొట్టేందుకు సిద్ధం కావడం అన్యాయం. ఇలాంటి చర్యలతో రైతుల ఆదాయం రెట్టింపు చేయాలన్న సంకల్పం నెరవేరుతుందా అన్నది ఆలోచన చేయాలని అన్నారు. ఒక పక్క తండ్రి ఆశయాన్ని నెరవేరుస్తానంటూ, వైఎస్ పేరుతో రైతు దినోత్సవాలు జరుపుతూ, మరో పక్క ఆయన అమలుచేసిన ఉచిత విద్యుత్తు పథకానికి తనయుడు జగన్మోహన్ తూట్లు పొడవడం రైతులను మోసం చెయ్యడం కాదా అని అన్నారు. దాదాపుగా 20 ఏళ్లుగా సాఫీ అమలవుతున్న ఉచిత విద్యుత్తుకు స్వస్తి చెప్పే చర్యల్ని పరోక్షంగా అమలు చేస్తూ మీటర్లు బిగించడం పేరిట ఎన్ని వందల కోట్లు ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా ఉచిత విద్యుత్ బిల్లుల్ని ఆయా సంస్థలకు ఎందుకు చెల్లించకూడదన్నారు. ఉద్యోగుల జీతాలు, పింఛన్లు ఇవ్వడానికే ఆపసోపాలు పడుతున్న ప్రభుత్వం ముమ్ముందు ఉచిత విద్యుత్తు బిల్లులు మాత్రం చెల్లిస్తుందన్న నమ్మకం ఏమిటన్నారు. ఒకసారి మీటరు బిగించి యూనిట్లు ప్రకారం బిల్లులు చెల్లించడం మొదలు పెడితే అది తమ మెడకు గుది బండ అవుతుందని రైతులు చేస్తున్న ఆందోళనలకు సమాధానం చెప్పాలన్నారు. ఇదంతా ఉచిత విద్యుత్ నుంచి దశలవారీగా తప్పుకునేందుకే అని రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. నగదు బదిలీ ముసుగులో స్వప్రయోజనమే ధ్యేయంగా రైతు శ్రేయస్సును దెబ్బతీస్తూ వంచించడం తగదన్నారు.

# గ్రామాల్లో అక్రమంగా క్లినిక్‌ల నిర్వహణ

### -ఆదిలాబాద్‌లో దాడులతో వెలుగులోకి విషయాలు

ఆదిలాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు పొందకుండా గ్రామీణ ప్రాంతాల్లో కరోనా వైద్యాలు చేస్తున్నారు. తమకు తోచిన విధంగా ప్రైవేట్ డాక్టర్లు దందాలకు తెరలేపారు. వేలాది రూపాయలు వైద్యం పేరిట దోచుకుంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. మరోవైపు ప్రైవేట్ ఆస్పత్రుల దోపిడీపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రకటించిన సిఎం టాస్క్‌ఫోర్స్ కూడా ఏర్పాటు చేశారు. ఈ దశలో జిల్లాల్లో కూడా ఆస్పత్రుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. అక్రమంగా నిర్వహిస్తున్న క్లినిక్‌లపై జిల్లా వైద్యాధికారులు ఆదిబాద్ జిల్లాలో బుధవారం మెరుపుదాడులు చేశారు. పలువురు ఆర్ఎంపీలు దవాఖానలు ఏర్పాటు చేసి వైద్యం చేస్తుండడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా క్లినిక్‌లను మూసి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో కొందరు ఆర్ఎంపీలు ప్రభుత్వ అనుమతులు పొందకుండానే వైద్యశాలలు నిర్వహిస్తున్నారు. చిన్నపాటి అనారోగ్యానికి గురైన వారి వద్దకు వెళ్తే రోగులను భయాందోళనకు గురి చేస్తున్నారు. అవసరం లేకున్నా పలు టెస్టులు చేయిస్తున్నారు. మందులు అంటగడుతున్నారు. దీంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని దస్నాపూర్, రాంనగర్‌లో ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న దవాఖానల్లో తనిఖీ చేశారు. ముందుగా శ్రీ బాలాజీ పాలి క్లినిక్‌ను తనిఖీ చేశారు. కొంతసేపటికి వచ్చిన ఓ వ్యక్తి తాను డాక్టర్‌నని చెప్పాడు. అధికారులు అతడి వైద్య వృత్తికి సంబంధించి పత్రాలు అడుగడంతో కోల్‌కతాలో ఎంబీబీఎస్ (అల్టర్నేట్ మెడిసిన్) చదివానని, సర్టిఫికెట్లు ఇంట్లో ఉన్నాయని సమాధానమిచ్చాడు. అర్హత లేకున్నా వైద్యం ఎందుకు చేస్తున్నావని అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్టార్ క్లినిక్‌లో ఓ వైద్యుడు సైలైన్లు, ఇంజెక్షన్లు, మందులు ఇవ్వడంతో అతనిపై మండిపడ్డారు. ప్రస్తుతం ఈ మూడు క్లినిక్‌లను మూసి వేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వైద్యశాలలు, ఆర్ఎంపీలపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# టీవీ నటి శ్రావణి ఆత్మహత్య

### యువకుడి బ్లాక్‌మెయిల్ బెదిరింపులే కారణం

### కేసు నమోదు చేసుకున్న పోలీసులు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): టీవీ నటి శ్రావణి బలవన్మరణానికి పాల్పడింది. హైదరాబాద్ ఎస్ఆర్‌నగర్ మధురానగర్‌లోని తన నివాసంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను హాస్పిటల్‌కు తరలించారు.. అప్పటికే ఆమె మృతి చెందినది వైద్యులు ధ్రువీకరించారు. కొంతకాలం క్రితం ఓ యువకుడు ఆమెకు టిక్‌టాక్ ద్వారా శ్రావణికి పరిచయం అయ్యాడు. అయితే సదరు యువకుడు తరచూ శ్రావణిని డబ్బులు ఇవ్వమంటూ వేధించేవాడని ఆమె కుటుంబ సభ్యులు తెలిపారు. అతని వేధింపులు భరించలేకే ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రావణిని ప్రేమించినట్లు నమ్మించి ఆమెతో సన్నిహితంగా ఉంటూ ఫోటోలు దిగి, వాటిని బయటపెడతానని డబ్బులు డిమాండ్ చేసినట్లు బంధువులు ఆరోపించారు. వేధింపులు అధికం కావడంతో ఇటీవల ఎస్ఆర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేసినట్లు తెలిపారు. అయినా వేధింపులు ఆపకపోవడంతో ఆత్మహత్య చేసుకుందంటూ కన్నీటి పర్యంతమయ్యారు. శ్రావణి మనసు మమత, మౌనరాగం సీరియల్స్‌లో నటించారు. ఆమె ఆత్మహత్యకు ప్రధాన కారణం టిక్ టాక్ లో పరిచయమైన దేవరాజురెడ్డి అని శ్రావణి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. దేవరాజురెడ్డిది తూర్పుగోదావరి జిల్లా కాకినాడ గొల్లప్రోలు అని తెలుస్తోంది. ఆయన టిక్‌టాక్‌లో శ్రావణికి పరిచయమయ్యాడు. శ్రావణితో పరిచయం ఉన్న దేవరాజ్ ఆమెకు దగ్గరయ్యాడు. ఆమెతో చనువుగా ఉన్న ఫోటోలను తీసుకున్నాడు. తను అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఫోటోలు బయటపెడతానని బెదిరించాడు. అడిగినప్పుడల్లా నగదు ఇచ్చినా ఆమె పై వేధింపులు గురి చేశాడు. దీంతో శ్రావణి దేవరాజుపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయినా అతనిలో మార్పు లేకపోవడంతో వేధింపులు తాళలేక శ్రావణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మూడో కారిడార్‌లోనూ మెట్రో పరుగులు

### -అంతంత మాత్రంగానే ప్రయాణికుల ఆదరణ

హైదరాబాద్,సెప్టెంబ59(ఆర్ఎన్ఎ): నగరంలో అన్ని రూట్లలో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చాయి. మూడో రూట్‌లో కూడా బుధవారం నుంచి సర్వీసులు ప్రారంభం అయ్యాయి. అన్‌లాక్ 4.0లో మెట్రో రైళ్ల నడిపేందుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వగా.. హైదరాబాద్‌లో మూడు దశల్లో మెట్రో సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 7న మియాపూర్ – ఎల్బీనగర్, 8న నాగోల్ – రాయదుర్గం మధ్య మెట్రో సర్వీసులు నడవగా.. బుధవారం ఎంజీబీఎస్ టూ జేబీఎస్ మధ్య ట్రైన్లు ఉదయం 7 నుంచి పరుగులు పెట్టాయి. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు రైళ్లు నడవనున్నాయి. కంటైన్మెంట్ జోన్లు ఉన్న ప్రాంతాల్లో మెట్రోస్టేషన్లు మూసి వేయనున్నారు. గాంధీ హాస్పిటల్, భరత్‌నగర్, మూసాపేట, యూసుఫ్‌గూడ మెట్రోస్టేషన్లు మూసే ఉండనున్నాయి. కరోనా మహమ్మారి నేపథ్యంలో సామాజిక దూరం పాటించేలా, స్టేషన్లు, రైళ్లలో మార్కింగ్ ఏర్పాటు చేశారు. నిత్యం స్టేషన్ పరిసరాలు, రైళ్లను సిబ్బంది శానిటైజ్ చేస్తున్నారు. కేవలం నగదు రహిత రూపంలో ప్రయాణం చేసేందుకు అధికారులు ప్రయాణికులకు అనుమతి ఇస్తున్నారు. ఆన్‌లైన్, స్మార్ట్‌కార్డ్, క్యూఆర్ కోడ్‌తో టికెట్లతో మాత్రమే జారీ చేస్తున్నారు. ప్రతి ఐదు నిమిషాలకు ఒక ట్రైన్ అందుబాటులో ఉండేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా, ప్రయాణికులు ఫేస్ మాస్క్ తప్పనిసరి చేశారు. లేకుంటే అధికారులు జరిమానా విధిస్తున్నారు. ప్రతి ప్రయాణికుడికి థర్మల్ స్క్రీనింగ్ చేసిన తర్వాతే స్టేషన్‌లోకి ప్రవేశం కల్పిస్తున్నారు. ప్రతి మెట్రో స్టేషన్‌లో ఐసోలేషన్ రూం ఏర్పాటు చేశారు. కాగా, మంగళవారం కారిడార్-1లో 17వేల మంది, కారిడార్-3లో 9వేల మంది ప్రయాణించినట్లు మెట్రో అధికారులు తెలిపారు.

# గ్రామాల్లో వెల్లివిరుస్తున్న పారిశుద్ధ్యం

## పల్లె ప్రగతితో విషజ్వరాలు తగ్గించాం

### -అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో మంత్రి ఎర్రబెల్లి



హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె ప్రగతి కార్యక్రమంలో విషజ్వరాలను తగ్గించగలిగామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు. అనేక విధాలుగా గ్రామాలను పరిశుభ్రత వైపు మళ్లించామని అన్నారు. గ్రామాల్లో ఇవాళ పచ్చదనం వెల్లివిరుస్తోందని అన్నారు. శాసనసభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా తండాలు, గిరిజన గ్రామ పంచాయతీల అభివృద్ధిపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. సీఎం కేసీఆర్ గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించారు. ఏండ్ల తరబడి ఉన్న ఎస్టీల కలలను సీఎం సాకారం చేశారు. గిరిజనులకు ఆరాధ్య దైవంగా కేసీఆర్ ఉన్నారు. తండాలను గ్రామపంచాయతీలుగా గుర్తించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. కొత్తగా 4,383 గ్రామపంచాయతీలు ఏర్పడ్డాయి. 1,827 కొత్త గిరిజన పంచాయతీలు ఏర్పడ్డాయి. పూర్తి ఎస్టీ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు 1,177 అని మంత్రి తెలిపారు. పల్లె ప్రగతి కార్యక్రమం ద్వారా గ్రామాలను అభివృద్ధి చేసుకుంటున్నాం. జనాభా తక్కువ ఉన్న ప్రతి గ్రామానికి రూ. 5 లక్షలు ఇస్తున్నామని చెప్పారు. 40 వేల మంది పారిశుద్ధ్య కార్మికులకు రూ. 5వేల చొప్పున ప్రోత్సాహకం రెండు నెలల పాటు ఇచ్చామన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ నిరంతరం శ్రమిస్తున్నారని అన్నారు. ప్రతి గ్రామంలో వైకుంఠధామం, డంపింగ్ యార్డ్‌తో పాటు ట్రాక్టర్ ఇచ్చామన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీలను ఏర్పాటు చేసి.. రైతులకు అవసరమయ్యే మొక్కలను అందిస్తున్నామని చెప్పారు. విషజ్వరాల బారిన పడకుండా గ్రామాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. పల్లెప్రగతి కార్యక్రమంతో విషజ్వరాలను తగ్గించగలిగామని చెప్పారు. గ్రామ పంచాయతీలకు ప్రతినెల 300 కోట్ల గ్రాంట్‌ను సమకూర్చుతుంది. ఈ ఏడాది గ్రామ పంచాయతీలకు 1847 కోట్ల 50 లక్షలు విడుదల చేయడం జరిగింది అని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు.

### ఉప సర్పంచ్‌ల తీరుపై మండిపాటు

తెలంగాణ రాష్ట్రంలోని ఉపసర్పంచ్‌లను పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. గ్రామపంచాయతీల అభివృద్ధిపై శాసనసభలో మంత్రి ఎర్రబెల్లి మాట్లాడారు. గ్రామాల్లో ఉపసర్పంచ్‌లతో ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సభ్యులకు సూచించారు. గ్రామసభలో తీర్మానం అయి ఆ కార్యక్రమం చేసిన తర్వాత ఉపసర్పంచ్ పెత్తనం చేయబోయినా, సంతకం పెట్టనన్న తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాంటి ఉపసర్పంచ్‌ల చెక్‌పవర్ రద్దు చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ప్రజల ఆమోదం తర్వాత ఉపసర్పంచ్ ఇబ్బంది పెడితే చెక్ పవర్ రద్దు చేసి,అవపసరమైతే వార్డు మెంబర్ నుంచి కూడా తొలగిస్తామన్నారు. ఇప్పటికే పది మంది ఉపసర్పంచ్‌లకు చెక్ పవర్ రద్దు చేశామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు స్పష్టం చేశారు.

# బ్యాంక్ ఇఎంఐల వడ్డీ మాఫీపై నోరుమెదపని కేంద్రం

### ప్రజలకన్నా కార్పోరేట్లపైనే అత్యధిక ప్రేమ

### ఆర్థిక నిపుణుల సూచనలు గాలికి

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): వేలకోట్లు గడించిన ప్రైవేటు టెలికామ్ సంస్థలు యాభైవేల కోట్ల పాత బకాయిలు కట్టడానికి పదేళ్ల వ్యవధి ఇచ్చిన కేంద్రం, మామూలు ప్రజల బ్యాకంక్ రుణాలకు సంబంధించి ఇఎంఐను రెండేళ్లు వాయిదా వేయడానికి తకిందులవుతోంది. బ్యాంకులు వేలకోట్లు బడాబాబులకు బాకీలు రద్దు చేస్తాయి. కరోనా వైరస్‌పరమైన ప్రతికూల పరిణామాల నేపథ్యంలో మొండి బాకీలు భారీగా పెరిగే అవకాశం ఉందని రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు ఇప్పటికే హెచ్చరించారు. ప్రజలకు నగదు బదిలీ చేయాలని మరో మాజీ గవర్నర్ రఘురామ రాజన్ చెప్పారు. చాలా మటుకు బాకీలను దివాలా చట్టం వెలుపలే పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఉండవచ్చుని తెలిపారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో భారీ మొండిబాకీల పరిష్కారానికి ప్రత్యేక బ్యాంకు ఏర్పాటు తప్పనిసరైన అవసరమని దువ్వూరి పేర్కొన్నారు. దివాలా చట్టం (ఐబీసీ) కోడ్ కింద కేసులు ఇప్పటికే పేరుకుపోయాయని, కొత్తగా వచ్చేవి న్యాయస్థానాలపై మరింత భారంగా మారతాయని తెలిపారు. కాబట్టి ఐబీసీ పరిధికి వెలుపలే చాలా మటుకు బాకీల పరిష్కారం చోటు చేసుకోవాల్సి రావచ్చని పేర్కొన్నారు. దివాలా చట్టంతో మొండిబాకీల సమస్య పరిష్కారం కాగలదని, బ్యాడ్ బ్యాంక్ అవసరం ఉండదని గతంలో భావించానని దువ్వూరి చెప్పారు. కానీ ఇప్పుడు ఆలోచిస్తే ఆ అభిప్రాయం సరికాదనిపిస్తోందని పేర్కొన్నారు. కరోనావ్యాప్తిలో ప్రపంచంలోనే ప్రథమ స్థానానికి ఎగబాకిన భారత దేశ పరిస్థితిపై అంతా ఆందోళన చెందుతుంటే ప్రజల దృష్టి మళ్లించడమే లాగని మోడీ ప్రభుత్వం ఆరాటపడుతున్నది. తొలిదశలో చాలా ఆర్భాటంగా వీడియో కాన్ఫరెన్సులు, చప్పట్లు దీపాలు వెలిగించడానికి పిలుపు ఇచ్చిన ప్రధాని మోడీ సరైన వ్యూహం అనుసరించ లేదని తేలిపోయింది. ఏకపక్షంగా నిర్ణయించిన లాక్‌డౌన్లు అన్‌లాక్ ప్రహసనం పరిమిత ఫలితాలే ఇచ్చింది. ఆర్థిక వ్యవస్థ ఆ దెబ్బతో పూర్తిగా కుదేలై పోయింది. ప్రజారోగ్యానికి ప్రధానంగా బాధ్యత వహించవసిన రాష్ట్ర ప్రభుత్వ ఖజానాలు ఖాళీ అయ్యాయి. అరకొరగా సర్కారు చికిత్స, అతి ఖరీదైన కార్పొరేట్ వైద్యం మధ్య ప్రజలు అల్లాడుతున్నారు. ఉపాధి ఉద్యోగాలు పోయి జీతాలు రాక వచ్చినా అరకొరతో జనం చస్తున్నారు. కరోనాను అరికట్టడం తమ ఘనత అని జబ్బు చరుచుకుంటూనే అంతా దైవకృతం విధి లిఖితం అంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. మీ తంటాలు మీరు పడమని ప్రకటించడం ఇందుకు పరాకాష్టగా చూడాలి. కేరళ తెలంగాణ సహా ఆరు రాష్ట్రాలు కేంద్ర విధానం ఆమోదయోగ్యం కాదని ఉమ్మడి కార్యాచరణ ప్రారంభించాయి. కేంద్ర విధానాలలో కార్పొరేట్ పక్షపాతం కష్టజీవుల పట్ల వివక్ష కళ్లకు కట్టినట్టు వెల్లడయ్యాయి. ఇదే సమయంలో అంతర్గత కలహాలలో మునిగిన కాంగ్రెస్ నేతలు గట్టిగా నిలదీయలేకపోతున్నారు. మీరు బిజెపి అనుకూలమంటే మీరే వత్తాసుదార్లని పరస్పరం ఆరోపించుకుంటున్నారు. టిఆర్ఎస్ ఇటీవల కొంత వ్యతిరేకిస్తున్నా ఇతర ప్రాంతీయ పార్టీలైన వైసీపీ ,టిడిపి, జనసేన దానితో ప్రత్యక్ష పరోక్ష స్నేహానికి పాకులాడుతున్నాయి, బిజెడి ,జెడియు, ఎడిఎంకె వంటివి కూడా అదే తరహాలో వుంటున్నాయి. ఇలాంటి పార్టీల సంగతి ఎలా వున్నా ప్రజల ముందు ప్రతికూలాంశాలు ఆవిష్కృతం కావడం బిజెపికి ఇరకాటంగా మారింది. భద్రత బాధ్యత లేకుండా విద్యార్థులకు పరీక్షలు జరపాలని నిర్ణయించి అదేదో వారి శ్రేయస్సు కోసమేనని గొప్పగా చెప్పుకోవడం పరీక్షలలో ముంచేస్తే పట్టించుకోబోరని వ్యూహం తప్ప వైరస్ గురించి ఏమంత చింత లేదన్న తీరు కనిపిస్తోంది. మొత్తంగా ఆర్థికంగా ప్రజలు నడ్డి విరిగి ఉన్నా, ఇఎంఐలపై వడ్డీ మాఫీ చేయాలన్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. మరోవంక 24 శాతం వరకూ జిడిపి పడిపోయి భవిష్యత్తు అయోమయంగా మారినప్పుడు ఎన్ని వ్యూహాలు పన్నినా చెల్లుబాటు కావడం కష్టమేనని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# వైఎస్ ఉచిత విద్యుత్‌కు మంగళం తప్పదేమో

### -నగదు బదిలీపై అనుమానాలు ఉన్నాయి: మధు

విజయవాడ,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మొదలైన ఉచిత విద్యుత్‌కు ఆయన పుట్టిన రోజునే అది కూడా విద్యుదుద్యమ ఇరవయ్యేళ్ల సందర్భంలో సవాళ్లు ఎదురవడం ఒక విపరీతం గానే భావించాలి. దీనికి ముందే కేంద్రం కొత్త విద్యుత్ సంస్కరణ పేరిట ముసాయిదా పంపించింది. అందులో విద్యుత్‌ను ఉత్పత్తి వ్యయం కంటే తక్కువకు ఇవ్వరాదని నిర్దేశించింది. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర నామమాత్రం చేసి ప్రైవేటు పెత్తనానికి రంగం సిద్ధం చేస్తున్నది. ఈ ప్రకారం చూస్తే ఆరు రూపాయల పైన యూనిట్‌కు విద్యుత్ తయారీ ఖర్చు లెక్కకట్టినప్పుడు రాష్ట్రం రెండు రూపాయల లోపుగానే సబ్సిడీ ఇవ్వడం అనుమతించబడుతుందని సిపిఎం నేత మధు అభిప్రాయపడ్డారు. ఇది సహజంగానే ఉచిత విద్యుత్‌పై కేంద్రం పెత్తనానికి నిదర్శనంగా చూడాలన్నారు. ఇకముందు సహజంగానే ఉచితం అని అనడానికి ఆస్కారం ఉండదన్నారు. ద్రవ్యలోటు పరిమితికి మించి అప్పులు తెచ్చుకోవడాన్ని అనుమతించాలంటే కేంద్రం నాలుగు షరతులు పెట్టడంలో ఆంతర్యం ఇదేనని అన్నారు. ఒకే రేషన్, పట్టణ పాక సంస్థ స్వయం సమృద్ధి, స్మార్ట్ మీటర్లు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పెంచడం అనే ఈ షరతులన్నీ ఆచరణలో ప్రజలపై భారం పెంచడానికి తప్ప మరోటి కాదని సిపిఎం నేత అభిప్రాయపడ్డారు. ప్రైవేటు కార్పొరేట్ల ప్రయోజనాలకు దారితీసే చర్యలను బిజెపి మరింత వేగం చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు ఎందుకంటే ప్రభుత్వం వారికి నగదు బదలాయించి మళ్లీ కట్టించుకోవడం కోసమని చెబుతున్నారు. అయితే ఈ పక్రియ అంత సులభం కాదు. నాలుగు పత్రాలు రైతు పేరు, భూయాజమాన్య పత్రం, ఆధార్

కార్డు బ్యాంకు ఖాతా అన్నీ సరిపోలితేనే బిల్లు చెల్లించడం జరుగుతుంది. అలాగే అనధికారిక పంపుసెట్లను క్రమబద్ధీకరించుకోవడానికి చాలా వ్యయ ప్రయాసలు వడపోతలు ఎదురవుతాయి. ఇదంతా దేనికంటే ఖచ్చితంగా వ్యవసాయానికే ఈ కరెంటు వాడుతున్నట్టు నిర్ధారించుకోవాల్సి కూడా ఉంటుంది. అసలు ఉద్దేశమే విద్యుత్ వడపోత. అని అన్నారు. ఈ క్రమంలో తేడాలు ఫిర్యాదు విధానపరమైన మార్పు ఎక్కడికి దారితీస్తాయోనన్న ఆందోళన ఉందన్నారు. గతానుభవాల నేపథ్యంలో చూస్తే హామీలు ఎన్ని వున్నా సాధించుకున్న రాయితీల కోతపడటం, ప్రయోజనాలు మాయం కావడం తెలుసన్నారు. జగన్ అధికారం చేపట్టగానే పిపిఎ సమీక్ష అంటూ విద్యుత్ వ్యయం తగ్గిస్తానన్నారు. కేంద్రం ఒత్తిడి తర్వాత ఆ జోరు తగ్గింది. సౌర పవన విద్యుత్‌ను చంద్రబాబు ప్రభుత్వం అవసరాన్ని మించి కొన్నట్టు ఆరోపించారు. ఇప్పుడు తామే దాన్ని విస్తరిస్తామంటున్నారు. ఇప్పటి వరకూ ఉచిత విద్యుత్‌కు నాలుగువేల కోట్లు సబ్సిడీ ఇస్తుంటే ఇప్పుడు దాన్ని ఎనిమిది వేల కోట్లకు పెంచి చూపిస్తున్నారని ఇదంతా ఎందుకని ఆక్షేపించారు. షరతుల ప్రకారం ఉచితాన్ని కూడా ఎక్కువ ధర లెక్క కడతారా? కేంద్రం చెప్పిన ప్రకారం అప్పు తెచ్చుకోగలిగిన మొత్తం 1500 కోట్లు దాటదు. కాని స్మార్ట్ మీటర్లు బిగించడానికే వెయ్యికోట్లు కేటాయించినట్టు అధికారులు చెబుతున్నారు. పైగా దీన్ని అమలు చేయడానికి పర్యవేక్షించడానికి వివిధ స్థాయిల్లో కమిటీలు ఏర్పాటు కానున్నాయన్నారు. మొత్తంగా ఇవన్నీ కూడా సక్రమంగా సాగుతాయా అన్నదే ప్రశ్నని అన్నారు.

# ఓయూ పరీక్షల షెడ్యూల్ విడుదల

### 15నుంచి దశలవారీగా ఆన్‌లైన్ పరీక్షలు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కరోనా ప్రేరేపిత లాక్‌డౌన్‌తో నిలిచిపోయిన చివరి సంవత్సరం సెమిస్టర్ పరీక్షలకు సుప్రీం కోర్టు అనుమతి ఇవ్వడంతో ఉస్మానియా యూనివర్సిటీ షెడ్యూల్ ప్రకటించింది. ఈ నెల 15 నుంచి దశలవారీగా పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఓయూ వర్సిటీ రిజిస్ట్రార్ సీ హెచ్. గోపాల్‌రెడ్డి అధ్యక్షతన స్టాండింగ్ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అనంతరం కోర్సుల వారీగా పరీక్షల షెడ్యూల్‌ను ఓయూ పరీక్షల విభాగం నియంత్రణాధికారి ప్రొ. శ్రీరామ్ వెంకటేశ్ విడుదల చేశారు. ఈ నెల 15 నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ, హోటల్ మేనేజ్‌మెంట్, బీసీఏ, బీఈడీ, ఎల్ఎల్‌బీ-3, 5వైడీసీ, ఎల్ఎల్ఎం, బీపీఈడీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 22 నుంచి డిగ్రీలోని బీఎస్సీ, బీఏ, బీకాం, బీఎస్‌డబ్ల్యూ, బీబీఏ కోర్సుల చివరి సంవత్సరం పరీక్షలు జరుగనున్నాయి. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ పరీక్షలకు ఈ నెల 14వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని యూనివర్సిటీ సూచించింది. ఆలస్య రుసుముతో ఈ నెల 19వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొంది. తొలిసారిగా డిగ్రీ పరీక్షల్లో ఆన్‌లైన్ ద్వారా విద్యార్థుల హాజరును తీసుకోనున్నారు. ప్రస్తుతం హాజరు కాలేని విద్యార్థులకు రెండు నెలల తర్వాత మరోసారి పరీక్షలు నిర్వహించనున్నట్లు పరీక్షల కంట్రోలర్ శ్రీరామ్ వెంకటేశ్ తెలిపారు. కరోనా జాగ్రత్తలతో యూసీ మార్గదర్శకాల మేరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో చివరి ఏడాదిలో 1.10 లక్షల మంది విద్యార్థులుండగా.. 65 వేల మంది డిగ్రీ కోర్సులు, 20 వేల మంది సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు చదువుతున్నారు. మరో 25వేల మంది పీజీ కోర్సులు చేస్తున్నారు. ఈ సారి విద్యార్థులు చదివే కళాశాలలోనే పరీక్షలు నిర్వహించాలని ఓయూ నిర్ణయించింది. కళాశాలలో విద్యార్థుల సంఖ్య వంద దాటితే అదే కళాశాలలో పరీక్ష రాసేందుకు వీలుంటుంది. అదే 50–60 మంది విద్యార్థులుంటే రెండు, మూడు కళాశాలలను కలిపి ఒక కేంద్రంగా ఎంపిక చేస్తున్నారు.

# కోరేగావ్ కేసులో మరో ముగ్గురిపై కేసు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): భీమా–కోరేగావ్ కుట్ర కేసులో ఎన్ఐఏ మరో ముగ్గురిని అరెస్టుచేసింది. ఈ కేసులో నిందితులుగా ఉన్న సాగర్‌గోర్కే, రమేశ్ గైచర్, జ్యోతి జగ్‌పతిలను అరెస్టు చేసినట్టు ఎన్ఐఏ అధికారులు వెల్లడించారు. నిషేధిత మావోయిస్టు అనుబంధ సంస్థ ఆధ్వర్యంలో 2017 మార్చిలో కబీర్‌కాలా మార్చ్ పేరిట పుణెలోని షానివర్‌వాడ ప్రాంతంలో కొన్ని సభలు నిర్వహించారు. ఆ సందర్భంగా పలువురు రెచ్చగొట్టే ప్రసంగాలుచేశారు. వాటి కారణంగా హింసాత్మక ఘటనలు చెలరేగాయని పేర్కొంటూ నమోదైన కేసును ఎన్ఐఏ దర్యాప్తు చేస్తున్నది. అరెస్టయిన ఈ ముగ్గురిపై ఐపీసీ సెక్షన్ కింద కేసులు నమోదుచేశారు.

# అంతర్వేది ఘటనపై ఉదాసీనత తగదు

### హిందూ దేవాలయాలపై దాడులు సహించం

### జగన్ ప్రభుత్వానికి సోము వీర్రాజు హెచ్చరిక

రాజమండ్రి,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ఏపీలో హిందూ దేవాలయాలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం వెంటనే స్పందించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు డిమాండ్ చేశారు.

చర్చిపై రాళ్ళు వేస్తే పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారని... మరి హిందూ దేవాలయాలపై దాడులు జరుగుతుంటే ఎందుకు పోలీసులు కేసులు నమోదు చేయటం లేదని ప్రశ్నించారు. గురువారం అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి రథం దగ్ధం ఘటనకు నిరసనగా బీజేపీ కార్యాలయంలో సోమవీర్రాజు నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడులపై ప్రభుత్వం స్పందించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తా ప్రభుత్వం ప్రజలు మనోభావాలు గుర్తించాలని తెలిపారు.

అంతర్వేది లక్ష్మీనరసింహా స్వామి రథం దగ్ధంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని ఆయన తెలిపారు.

అంతర్వేది సంఘటనపై విశ్వహిందూ వరిషత్ ఉద్యమానికి మద్దతు ఇస్తామన్నారు.

టీటీడీ నిధులను ప్రభుత్వం వాడుకుంటే బీజేపీ సహించదని స్పష్టం చేశారు. టీటీడీ చైర్మన్ పదవిని ధర్మాచార్యులకు మాత్రమే ఇవ్వాలన్నది బీజేపీ ఎజెండాగా చెప్పుకొచ్చారు.

టీటీడీ రాజకీయ పార్టీల నేతలు పునరావాసం కాకుడదనే అంశం 2024 ఎన్నికల బీజేపీ ఎజెండా అని స్పష్టం చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతినకుండా ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అంతర్వేది లక్ష్మి నరసింహా స్వామి రథం దగ్ధం కేసులో నిందితులను వెంటనే అరెస్టు చేయాలన్నారు. నిందితులను అరెస్టు చేసే వరకు బీజేపీ, జనసేన ఉద్యమం కొనసాగుతుందని సోమువీర్రాజు స్పష్టం చేశారు.

# కరోనా పేరుతో ప్రైవేట్ దోపిడీ

### -ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలి: బిజెపి

మంచిర్యాల,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కరోనా పేరుతో ప్రైవేటు ఆ సుపత్రులు సామాన్య ప్రజలను ఇబ్బంది పెడుతున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. ఎక్కువ ఫీజుల వసూలు చేస్తున్నారని ఆరోపించినా చర్యలు తీసుకోవడం లేదన్నారు. కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని, మంచిర్యాలలో ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రైవేటు ఆసుపత్రుల్లో ఎక్కువ డబ్బులు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ప్రజలు ఉపాధి లేక అలమటిస్తున్న పరిస్థితుల్లో ప్రైవేటు ఆసుపత్రుల్లో అధికఫీజులు వసూలు చేస్తూ దోపిడీకి పాల్పడున్నారన్నారు. ఇకపోతే చెన్నూరులో ఐసోలేషన్ కేంద్రం ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని రఘునాధ్ అన్నారు. జిల్లాలో ఒక్క బెల్లంపల్లిలోనే ఐసోలేషన్ కేంద్రాన్ని ఏ ర్పాటు చేయడం వల్ల కరోనా రోగులు తీవ్ర ఇబ్బందు లకు గురవుతున్నారని తెలిపారు. జిల్లా కేంద్రంలో ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 15న ప్రభుత్వ విప్ బాల్క సుమన్ పత్రికాముఖంగా చెన్నూరులో ఐసోలేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చి ఇంత వరకు ప్రారం భించలేదని ప్రశ్నించారు. కరోనా విలయ తాండవం చేస్తుంటే ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదన్నారు. జిల్లా బులెటిన్‌లో ఒక రకంగా ఉంటే రాష్ట్ర బులెటిన్‌లో మరో రకంగా ఉండడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పేషెంట్లకు సరిపడ ఐసోలేషన్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. అలాగే సామాన్య జనాన్ని మోసం చేస్తూ అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేటు ఆసుపత్రులను నియంత్రించాలని పేర్కొన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు అనుమతి లేకున్నా కొవిడ్ పే షెంట్లను అడ్మిట్ చేసుకుంటూ వైద్యం అందిస్తున్నారన్నారు. కలెక్టర్, డీఎంహెచ్ఓ అన్ని ఆసుపత్రులను పర్యవేక్షించాలని కోరారు.

# అడవుల్లో పెద్దపులుల సంచారం

### -లోపలికి వెళ్లకుండా రైతులకు సూచన

కరీంనగర్,సెప్టెంబర్10(నేటినిజం ప్రతినిధి):ఆడవి శ్రీరాంపూర్ శివారులో పులుల సంచారిస్తున్నయని ఆటవీశాఖ అధికారులు నిర్ధారణ చేశారు. అడవి శ్రీరాంపూర్ శివారు నుంచి అమరాబాద్, దార్యపూర్ అడవి గుండబగుల్ల గుట్ట సమీపంలోని అడవిలోకి పులులు చేరినట్లు తెలిసింది. వీటిని గుర్తించేందుకు సిసి కెమెరాలను అమర్చాలని చూస్తున్నారు. వీటి ద్వారా వాటిని స్పష్టంగా గుర్తించవచ్చున్నారు. డీఎఫ్‌వో రవిప్రసాద్ మాట్లాడుతూ చనిపోయిన ఆవు వద్దకు పులులు ఆహారం కొసం తిరిగి వస్తాయని ఆ చోటే సీసీ కెమెరాలను అమర్చుతామన్నారు. సిబ్బంది సీసీ కె మెరాలతో చనిపోయిన ఆవు వద్దకు వెళ్తుండగా మళ్లీ పెద్దపులి కాలి అడుగులు కనిపించడంతో సిబ్బంది కెమెరాలను అమర్చకుండానే వెను దిరిగారు. అయితే మరోమారు అడవుల్లోకి వెళ్లవద్దని స్థానిక రైతులకు సూచించారు. ముత్తారం మండలం మచ్చుపేట గ్రామ శివారులోని బగుళ్లగుట్టలో సోమవారం ఆవులమందపై పులులగుంపు దాడి చేయడంతో ఓ ఆవు మృత్యువాత పడగా నాలుగు ఆవులకు గాయాలు అయ్యాయి. మచ్చుపేట గ్రామానికి చెందిన కర్కురి రాజయ్యకు చెందిన 30 ఆవులను నిత్యం గ్రామ శివారులోని బగుళ్ల గుట్ట సమీపంలోని అడవికి మేత కోసం తీసికెళ్తుంటాడు. ప్రతి రోజూలాగానే సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో ఆవుల మందను మేత కోసం సమీపంలోని ఆడవిలోకి తీసుకెళ్లాడు. ఆవుల మందతో అడవిలోకి వెళ్లిన రాజయ్యకు పులులు తారసపడ్డాయి. దీంతో ఒక్క సారిగా భయాందోళనతో అరుస్తూ పొదల్లోకి వెళ్లి దాక్కున్నాడు.

ఈ ఆరుపులను ఓ రైతు తన పొలం వద్ద నుంచి విని స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్థులకు సమాచారం అందించాడు. వారు చేరుకొని ఆవులమంద, రాజయ్య కోసం గాలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో రాజయ్యతో పాటు ఆవుల మందను గుర్తించారు. అనంతరం ఆవులను, రాజయ్యను గ్రామానికి తరలించారు. గాలింపు చర్యల అనంతరం రాజయ్యను గుర్తిం చిన ఆటవీశాఖ అధికారులు, పోలీసులు రాజయ్యను విచారించారు. కళ్ల ఎదుటే ఆవును పెద్దపులులు చంపివే శాయని రాజయ్య ఆవేదన వ్యక్తం చేశాడు. రాజయ్య ప్రాణం భయంతో అరవగా అక్కడి నుంచి పులులు ఒక్కొక్కటిగా వెళ్లిపోయాయి. దీనితో అడవుల్లోకి పోవద్దని అధికారులు సూచించారు.

# దళితుల భూములకు రక్షణ లేకుండా పోయింది: ఎమ్మార్పీఎస్

వనపర్తి,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ముదెకరాల పంపిణీ మాట దేవుడెరుగు గత ప్రభుత్వాలు ఇచ్చిన అసైన్డ్ భూములను తిరిగి లాగేసుకుంటున్నారని ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్ మండిపడ్డా రు. తొలి ముఖ్యమంత్రి దళితుడే అన్న కేసీఆర్ ప్రమాణ స్వీకారం చేస్తుంటే ప్రేక్షక పాత్ర పోషించిన ప్రతిపక్షాలు నేడు దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను లాగేసుకుంటున్నా నోరు మెదపడం లేదన్నారు. దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కేసీఆర్‌పై రాజకీయ యుద్ధం మొదలవుతుందని హెచ్చరించారు.

ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వానికి ప్రధాన ప్రతిపక్షం దళితులు, గిరిజనులు, మైనార్టీలేనని అన్నారు. పలు కార్యక్రమాల్లో ఆయన మాట్లాడుతూ ఎలాంటి భవనాలు నిర్మించాలన్నా దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములే ముఖ్యమంత్రికి కనిపిస్తున్నాయని అన్నారు. 2023లో జరిగే ఎన్నికల్లో దళిత, బడుగు, బలహీన వర్గాల తరుపున మహా జన సోషలిస్టు పార్టీ బరిలో నిలుస్తుందని అన్నారు. కేసీఆర్‌కు తగిన గుణపాఠం చెబుతుందని అన్నారు. జూరాలలో బాలికపై అత్యాచారం చేసిన యువకుడికి 45 రోజుల్లోనే బెయిల్ మంజూరు చేయడం సరైంది కాదన్నారు. తక్షణమే బెయిల్ రద్దు చేసి ఆ యువకుడిని రిమాండ్‌కు తరలించాలని అన్నారు.

# అంతర్వేది ఘటనపై సర్వత్రా ఆందోళన

### -దీక్షకు దిగిన బిజెపి నేత కన్నా

గుంటూరు,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): జిల్లాలో బీజేపీ నేత కన్నా లక్ష్మీనారాయణ గురువారం ఉదయం నిరసన దీక్షకు దిగారు. ఏపీలో హిందూ దేవాలయలపై వరుసగా జరుగుతున్న దాడులకు నిరసనగా కన్నా దీక్ష చేపట్టారు. పలువురు బీజేపీ నేతలు దీక్షలో పాల్గొన్నారు. తూర్పుగోదావరి జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో జరిగిన అగ్నిప్రమాదంలో 62 ఏళ్ల చరిత్ర ఉన్న శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి రథం అగ్నికి ఆహుతవడం కలకలం రేపింది. ఈ ఘటనపై ప్రతిపక్షాలు, హిందూ పరిషత్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మరోవైపు ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్ వల్ల జరిగిందా..? ఎవరైనా తగులబెట్టారా అన్న కోణంలో అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. ఈ దశలో సర్వత్రా ఆందోళనలు వ్యక్తం అవుతున్న దశలో కన్నా దీక్షకు దిగారు. రథం దగ్ధం కేసులో దోషులను పట్టుకోవాలన్నారు.

పవన్ కళ్యాణ్ ధర్మపరిరక్షణ దీక్ష

జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం ఉదయం ధర్మ పరిరక్షణ దీక్షను చేపట్టారు. అంతర్వేది శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి రథం దగ్ధం అయిన నేపథ్యంలో జనసేన, బీజేపీ సంయుక్తంగా ఈరోజు ఉదయం 10 గంటల నుంచి ధర్మ పరిరక్షణ దీక్షకు పిలుపునిచ్చాయి. ధర్మ పరిరక్షణ దీక్షకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా జనసేన నాయకులు, శ్రేణులు ఈ దీక్ష చేపట్టడం గురించి ముఖ్య నాయకులతో పవన్ చర్చించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ దీక్షలకు అన్ని ఏర్పాట్లు జరిగాయని పవన్‌కు పార్టీ నేతలు తెలిపారు.

# రాష్ట్ర రెవెన్యూ చరిత్రలో సరికొత్త అధ్యాయం

**ధరణి వెబ్‌సైట్ ద్వారా ప్రజలకు సమగ్ర సమాచారం**
**ధరణిలో అగ్రికల్చర్,నాన్ అగ్రి కల్చర్ విభాగాలు**
**ప్రజలు అనుభవిస్తున్న బాధలకు చరమగీతం పాడేలా చట్టం**
**భూ రికార్డుల ప్రక్షాళనతో కొంత ఫలితం వచ్చింది**
**తెలంగాణ వచ్చినప్పుడున్న సంతోషం ఇప్పుడూ ఉంది**
**ఉద్యోగులు ఎవరినీ తొలగించడం లేదు**
**వీఆర్వోలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తాం**
**రెవెన్యూ కోర్టుల స్థానంలో ట్రిబ్యునళ్ల ఏర్పాటు**
**తహసీల్దార్లే జాయింట్ రిజిస్ట్రార్లు**
**అసెంబ్లీలో కొత్త రెవెన్యూ చట్టం ప్రవేశ పెట్టిన సిఎం కెసిఆర్**

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్ర రెవెన్యూ చరిత్రలో సరికొత్త అధ్యాయానికి సర్కార్ శ్రీకారం చుట్టింది. భూముల వ్యవహారాల్లో తగాదాలు, అంచాలు, పంచాయితీలు, లిటిగేషన్లు తొలగించేలా సమగ్ర రెవెన్యూ చట్టాన్ని రూపొందించింది. ధరణి వెబ్‌సైట్ ద్వారా సమగ్ర సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచనుంది. భూముల వివరాలను రెండు విభాగాలుగా చేస్తూ ధరణిలో అందుబాటులో ఉంచుతారు. అలాగేవ్యవసాయ,వ్యవసాయేతర భూముల వివరాలను పక్కాగా నిర్దేశించారు. ఈ మేరకు చారిత్రాత్మక రెవెన్యూ బిల్లును ముఖ్యమంత్రి కెసిఆర్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ అనేక కీలక అంశాలను ప్రకటించారు. తరతరాలుగా ప్రజలు అనుభవిస్తున్న బాధలకు చరమగీతం పాడి ముఖ్యంగా రైతులకు పేదలకు సరళీకృతమైనటువంటి కొత్త చట్టాన్ని ఈ సభలో ప్రతిపాదిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి ఈ బిల్లు వర్తిస్తుందని అన్నారు. నవీన కాలంలో అనేక ఉత్పత్తి సాధనలు వచ్చాయి. మనిషి జీవితం భూమి చుట్టూ తిరిగింది. గత ఐదారు వేల సంవత్సరాల నుంచి వ్యవసాయం చేయడం మొదలు పెట్టారు. అప్పట్నుంచి భూమిని ఉత్పత్తి సాధనంగా గుర్తించడంతో దాని విలువ పెరిగింది. నేటికి కూడా భూ సమస్యలు ఉన్నాయి. భూ సంస్కరణలు అనేవి ఒక పద్ధతిలో చానలైజ్ చేయాలని చాలా ప్రయత్నాలు జరిగాయి. ఈ క్రమంలో తెలంగాణలో అనేక రెవెన్యూ సంస్కరణలు జరిగాయి. పీవీ నరసింహా రావు, ఎన్టీఆర్, చంద్రబాబు, వైఎస్ హయాంలో కొన్ని మార్పులు జరిగాయి. గత పాలకులు రెవెన్యూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించలేకపోయారని అన్నారు. రెవెన్యూ అధికారులపై గతంలోనూ అనేక దాడులు జరిగాయని సీఎం గుర్తు చేశారు. అయితే సమగ్రంగా తీసుకుని వస్తున్న ఈ చట్టంపై ప్రజల్లో ఆసక్తి నెలకొందని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడినప్పుడు ఎంత సంతోషంగా ఉన్నానో రెవెన్యూ బిల్లు పెడుతున్నప్పుడు అంతే సంతోషంగా ఉన్నానని సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఈ బిల్లు కోసం మూడేళ్లుగా కసరత్తు చేశాం. భూ రికార్డుల ప్రక్షాళనతో కొంత ఫలితం వచ్చింది. మా బాధ్యతగా రెవెన్యూ అధికారులతో చర్చించాం. ఏ చట్టం తెచ్చినా గౌరవిస్తామని రెవెన్యూ అధికారులు చెప్పారు. ఈ చట్టం ఫలితంగా ప్రజలకు మంచి జరుగుతుంది. ఈ చట్టంతో ఉద్యోగులకు ఎలాంటి ముప్పు ఉండదు. వీఆర్వోలను స్కేల్ ఎంప్లాయిస్‌గా మారుస్తాం. రెవెన్యూ బాగు చేసేందుకు ఆ శాఖ బాధ్యతలు తీసుకున్నా. రెవెన్యూ బిల్లుపై శుక్రవారం రోజు సమగ్ర చర్చ జరుగుతుందని కేసీఆర్ తెలిపారు. చర్చల్లో వచ్చిన సూచనలు ,సలహాలు కూడా తీసుకుని సమగ్ర చట్టానికి పూనుకుంటామని అన్నారు.

### త్వరలో అందుబాటులోకి ధరణి పోర్టల్

త్వరలో ధరణి పోర్టల్ అందుబాటులోకి వస్తుందని, ధరణి పోర్టల్‌లో అన్ని వివరాలు ఉంటాయని సిఎం కెసిఆర్ సభాముఖంగా ప్రకటించారు. ధరణి పోర్టల్ రెండు భాగాలుగా ఉంటుంది. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ వివరాలు ధరణిలో ఉంటాయి. ఈ పోర్టల్‌తో రైతులకు మేలు జరుగుతుంది. తెలంగాణ రాష్ట్ర భూభాగం 2.75కోట్ల ఎకరాలు. ధరణి పోర్టల్ పారదర్శకంగా ఉంటుంది. ప్రపంచంలో ఏమూలనైనా ధరణిని ఓపెన్ చేసి చూసుకోవచ్చు. ధరణి పోర్టలే అన్నింటికీ ఆయువు పట్టు. కొత్త చట్టం ప్రకారం ఏ అధికారికీ విచక్షణాధికారాలు ఉండవు. తెలంగాణలోని ప్రతి ఇంచు భూమిని సర్వే చేయిస్తాం. ఇకపై ఎవరూ పక్కవారి భూమిపై కన్నేయొద్దు. ఇకపై ఇంచు భూమి కూడా ఆక్రమించుకోలేరు. వ్యవసాయ భూములనే ఎమ్మార్వోలు రిజిస్ట్రేషన్ చేస్తారు. నాన్ అగ్రికల్చర్ భూములను సబ్ రిజిస్ట్రార్లు రిజిస్ట్రేషన్ చేస్తారని కేసీఆర్ స్పష్టం చేశారు. కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ఇక నుంచి తహసీల్దార్లే జాయింట్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తారని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తహసీల్దార్లకు వ్యవసాయ భూములే రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఉంటుంది అని సీఎం పేర్కొన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. గ్రామకంఠం, పట్టణ భూములను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తామన్నారు. ధరణి పోర్టల్‌లో పంచాయతీ, పురపాలిక, నగరపాలిక, జీహెచ్ఎంసీ ఆస్తుల వివరాలు ఉంటాయన్నారు. ఎవరు ఎక్కడున్నా ఉన్న చోట నుంచే ఆస్తుల వివరాలు చూసుకునేలా వివరాలు అందుబాటులో ఉంటాయని అన్నారు. రిజిస్ట్రేషన్ పక్రియ ముందే అలాట్ చేయాలి. అలాట్ చేసిన వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. రిజిస్ట్రేషన్ కోసం ముందే ప్రజలు స్లాట్ అలాట్‌మెంట్ కోరాలి. విద్యావంతులైతే డాక్యుమెంట్లు వాళ్లే రాసుకోవచ్చు. కావాలంటే ఫీజు చెల్లించి డాక్యుమెంట్ రైటర్ సాయం తీసుకోవచ్చు. క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే పోర్టల్‌లో అప్‌డేట్ అవుతాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సహా అన్ని సేవలు ఏకకాలంలో పూర్తి అవుతాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తరతరాలుగా ప్రజలు అనుభవిస్తున్న బాధలకు చరమగీతం పాడి ముఖ్యంగా రైతులకు, పేదలకు సరళీకృతమైన కొత్త చట్టాన్ని ఈ సభలో ప్రతిపాదిస్తున్నందుకు సంతోషంగా ఉందని సీఎం అన్నారు. రెవెన్యూ బిల్లులోని పలు ధరణి పోర్టల్‌లో ముఖ్యాంశాలు ధరణి పోర్టల్‌లో అన్ని వివరాలు ఇలా ఉంటాయి. పూర్తి పారదర్శకంగా ఉంటుంది. పోర్టల్ రెండు భాగాలుగా ఉంటుంది. అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ లాండ్ వివరాలు ధరణి పోర్టల్‌లో ఉంటాయి. ప్రపంచంలో ఏ మూలనుంచైనా ధరణి వెబ్‌సైట్‌ను ఓపెన్ చేసి చూసుకోవచ్చు. కొత్త చట్టం ప్రకారం ఏ అధికారికి విచక్షణాధికారాలు ఉండవు. కొత్త రెవెన్యూ చట్టంతో ఇకపై ఆస్తి తగాదాలు ఉండవు. రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యూటేషన్ జరుగుతుంది. మ్యూటేషన్ పవర్‌ను కూడా ఆర్డీవో నుంచి తొలగించి ఎమ్మార్వోకు అప్పగిస్తారు. మ్యూటేషన్ అయిన వెంటనే ధరణిలో అప్‌లోడ్ కావాలి. రిజిస్ట్రేషన్డాక్యుమెంట్, పాస్‌బుక్, ధరణి కాపీ వెంటనే తీసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర భూభాగం 2 కోట్ల 75 లక్షల ఎకరాలు ఉంటుంది.

ఉమ్మడి ఒప్పందం ఉంటేనే వారసత్వ భూ విభజన జరుగుతంది. పాస్ పుస్తకాలు లేని భూములకు వాటిని జారీ చేసే అధికారం తహసిల్దార్లదే కానుంది. వ్యవసాయ భూముల క్రయవిక్రయాలు పూర్తయిన వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. రికార్డు పూర్తిచేసి కొన్నవారికి బదిలీ చేయాలి. తప్పుచేసిన తహసీల్దార్‌పై బర్తరఫ్ క్రిమినల్ చర్యలు, తిరిగి భూములు స్వాధీనం చేయడం సాగుతుంది. రికార్డుల్లో సవరణలు చేస్తే ప్రభుత్వం అధికారులపై దావా చేయకూడదు. డిజిటల్ రికార్డుల ఆధారంగానే వ్యవసాయ రుణాలు ఉంటాయి. రుణాల మంజూరుకు పాస్ పుస్తకాలను బ్యాంకుల్లో పెట్టకోరాదు. వీఆర్వోలను ఏదైనా సమానస్థాయి ఉద్యోగానికి బదిలీ చేస్తారు. వీఆర్ఎస్ లేదా స్వచ్ఛంద పదవీ విరమణకు అవకాశం కల్పించేలా చట్టం ఉంటుంది. రికార్డులను అక్రమంగా దిద్దడం, మోసపూరిత ఉత్తర్వులు చేయకూడదుఅక్రమాలకు పాల్పడితే ఉద్యోగులపై చర్యలు, సర్వీసు నుంచి తొలగిస్తారు. జాగీరు భూముల్ని ప్రభుత్వ భూములుగా రెవెన్యూ రికార్డుల్లో రిజిస్టర్ చేయాలి. కొత్త పట్టాదారు పుస్తకం హక్కుల రికార్డుగా గుర్తింపు- ఇకపై సబ్ రిజిస్ట్రార్ అధికారాలు తహసిల్దార్లకు అప్పగింత ఏ రకమైనరి జిస్ట్రేషన్ కోసమైనా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుకింగ్ తప్పనిసరి. 1971 యాక్ట్ రద్దుతో పెండింగ్‌లో ఉన్న ఫైల్స్, కేసులు ట్రిబ్యునల్‌కు నివేదిస్తారు. విచారణ తర్వాత ట్రిబ్యునల్ ఉత్తర్వులే ఫైనల్ కానున్నాయి.

### వీఆర్వోలకు ప్రభుత్వం ఊరట

వీఆర్ఏలకు తీపి కబురు అందిస్తున్నానని ముఖ్యమంత్రి కేసీఆర్ స్పష్టం చేశారు. ప్రజలకు మేలు చేసేందుకు మాత్రమే కొత్త రెవెన్యూ చట్టం బిల్లును తీసుకువస్తున్నామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. శాసనసభలో ఈ బిల్లును ప్రవేశ పెట్టిన సందర్భంగా సీఎం మాట్లాడారు. వీఆర్ఏలను స్కేలు ఉద్యోగులుగా గుర్తిస్తామన్నారు. వారి అర్హతలను బట్టి ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ శాఖల్లో వీఆర్వోలను భర్తీ చేస్తామన్నారు. రెవెన్యూ సంస్కరణల వల్ల ఉద్యోగులకు ఎలాంటి సమస్య ఉండదని సీఎం స్పష్టం చేశారు. ఈ సంస్కరణల వల్ల ప్రజలకు ఇబ్బందులు తొలగుతాయన్నారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి గత మూడేళ్ల నుంచి కృషి చేస్తున్నామని సీఎం తెలిపారు. ఏ ఒక్కరినీ తొలగించమని కూడా హామీ ఇచ్చారు. అలా రాష్ట్రంలోని వీఆర్వోలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో అనివార్య పరిస్థితుల్లోనే వీఆర్వో వ్యవస్థను రద్దు చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. వీఆర్వోలను వివిధ శాఖల్లో సర్దుబాటు చేస్తామని ప్రకటించారు. 5485 మంది వీఆర్వోలు వర్కింగ్‌లో ఉన్నారు. వీరందరికి ఉద్యోగ భద్రత కల్పిస్తామన్నారు. వీఆర్వోల ఉద్యోగాలు ఎక్కడికి పోవు. రాబోయే రోజుల్లో వారికి ఆప్షన్లు ఇస్తామన్నారు. తాసీల్దార్లు, ఆర్డీవోలు అలాగే ఉంటారు. భూ వివాదాలపై తాసీల్దార్లు, ఆర్డీవో, జేసీలు ఆర్డర్లు ఇస్తారని పేర్కొన్నారు. ఆర్డర్లు ఇచ్చిన రెవెన్యూ అధికారుల వద్దే కోర్టులు ఉన్నాయి. ఇక నుంచి రెవెన్యూ కోర్టులు ఉండవు అని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు.

### తహసీల్దార్లే జాయింట్ రిజిస్ట్రార్లు

కొత్త రెవెన్యూ చట్టం ప్రకారం ఇక నుంచి తహసీల్దార్లే జాయింట్ రిజిస్ట్రార్లుగా వ్యవహరిస్తారని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తహసీల్దార్లకు వ్యవసాయ భూములే రిజిస్ట్రేషన్ చేసే అధికారం ఉంటుంది అని సీఎం పేర్కొన్నారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో వ్యవసాయేతర భూముల రిజిస్ట్రేషన్లు జరుగుతాయన్నారు. గ్రామకంఠం, పట్టణ భూములను వ్యవసాయేతర భూములుగా పరిగణిస్తామన్నారు. ధరణి పోర్టల్‌లో పంచాయతీ, పురపాలిక, నగరపాలిక, జీహెచ్ఎంసీ ఆస్తుల వివరాలు ఉంటాయన్నారు. ఎవరు ఎక్కడున్నా ఉన్న చోట నుంచే ఆస్తుల వివరాలు చూసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ పక్రియ ముందే అలాట్ చేయాలి. అలాట్ చేసిన వివరాలు వెబ్‌సైట్‌లో నమోదు చేయాలి. రిజిస్ట్రేషన్ కోసం ముందే ప్రజలు స్లాట్ అలాట్‌మెంట్ కోరాలి. క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చేసిన వెంటనే పోర్టల్‌లో అప్‌డేట్ అవుతాయి. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ సహా అన్ని సేవలు ఏకకాలంలో పూర్తి అవుతాయని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

### రెవెన్యూ కోర్టుల స్థానంలో ల్యాండ్ ట్రిబ్యునళ్లు

తెలంగాణలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా సంస్కరిస్తోంది ప్రభుత్వం.. ఆర్‌వోఆర్ – 2020 చట్టంతో రెవెన్యూ

సంస్కరణలకు తెరతీసిన ప్రభుత్వం రెవెన్యూ కోర్టులను పూర్తిగా రద్దు చేయనుంది. ఏళ్ల తరబడి తేలకుండా రెవెన్యూ కోర్టుల్లో వ్యాజ్యాలు కొనసాగడం, క్షేత్రస్థాయిలో భూ వివాదాలు పెరుగుతుండటంపై ప్రభుత్వం దృష్టి సారించింది. వేగంగా, పారదర్శకంగా తీర్పులు ఇచ్చేలా రెవెన్యూ కోర్టుల స్థానంలో ల్యాండ్ ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. జిల్లాకు ఒకటి చొప్పున రాష్ట్రంలోని 33 జిల్లాల్లోనూ వీటిని నెలకొల్పుతారు. ఇప్పటివరకు భూ యాజమాన్య హక్కుల కల్పన చట్టం (ఆర్‌వోఆర్) కింద తహసీల్దారు, ఆర్డీవో, సంయుక్త కలెక్టర్లు (ప్రస్తుతం అదనపు కలెక్టర్లు) రెవెన్యూ కోర్టులను నిర్వహిస్తున్నారు. ఆ పైన భూపరిపాలన కమిషనర్, రెవెన్యూ మంత్రి వరకు అప్పీళ్లకు అవకాశం ఉంది. భూ వివాదాల్లో ఇరువర్గాలకు నోటీసులు జారీ చేయడం, తీర్పులు ఇచ్చి వివాద పరిష్కారం చేసే అధికారాలు దిగువ స్థాయిలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో తహసీల్దారు నుంచి సంయుక్త కలెక్టర్ వరకు ఉన్న కోర్టుల్లో పలు రకాల కేసుల విచారణ తేలడం లేదని ప్రభుత్వం గమనించింది. వివాదాలకు పరిష్కారం లభించక ఏళ్లతరబడి భూ యజమానులు కార్యాలయాల చుట్టూ తిరగడం, చివరికి అప్పీళ్లకు పై కోర్టులను ఆశ్రయిస్తున్నారని గుర్తించింది. ఈ క్రమంలో తహసీల్దారు నుంచి సంయుక్త కలెక్టర్ వరకు ఉన్న కోర్టులను ప్రభుత్వం రద్దు చేస్తోంది. కొత్త చట్టంతో వారి అధికారాలకు కత్తెర పడనుంది. వాటి స్థానంలో జిల్లా స్థాయిలో ట్రైబ్యునళ్లు పని చేయనున్నాయని కెసిఆర్ వివరించారు.

## రిలయన్స్ ఇండస్ట్రీస్ సరికొత్త రికార్డులు

**జియో ప్లాట్‌ఫాంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు**

ముంబై,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): రిలయన్స్ ఇండస్ట్రీస్ సరికొత్త రికార్డులు సృష్టించింది. డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫాంలోకి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చిన అనంతరం, ఇప్పుడు రిలయన్స్ రిటైల్‌లోకి వస్తున్నాయి. అమెరికా కంపెనీ సిల్వర్ లేక్ రూ.7500 కోట్లు ఇన్వెస్ట్ చేసిన సంగతి తెలిసిందే... కేకేఆర్ కూడా పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనబరుస్తున్నది. ఈ రెండు కూడా జియోలోను పెట్టుబడి పెట్టాయి. జియోలో ఇన్వెస్ట్ చేసిన పలు సంస్థలు రిలయన్స్ రిటైల్‌లోను పెట్టుబడులు పెట్టనున్నట్లు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో రిలయన్స్ షేర్లు మరోసారి దూకుడు పెంచాయి. రిలయన్స్‌లో జియో పెట్టుబడుల తర్వాత షేర్ ధర రూ.2000 క్రాస్ చేసింది. రిటైల్‌లో పెట్టుబడుల నేపథ్యంలో రూ.2250 దిశగా దూసుకెళ్తోంది. ఈ రోజు గం.12.01 సమయానికి రిలయన్స్ షేర్ 4.52 శాతం ఎగిసి రూ.2,259 వద్ద ట్రేడ్ అయింది. మోతీలాల్ ఓస్వాల్ రిలయన్స్ ఇండస్ట్రీస్ బైరేటింగ్ ధరను రూ.2250గా పేర్కొంది. అంతకుముందు సెషన్‌లో షేర్ ధర 2.58 శాతం ఎగిసి రూ.2161.25 వద్ద క్లోజ్ అయింది. ఈ రోజు 3 శాతానికి పైగా ఎగిసింది. రిలయన్స్ ఇడండస్ట్రీస్ షేర్లు ఈ రెండు సెషన్‌లలోనే దాదాపు 5 శాతం లాభపడింది. రిలయన్స్ రిటైల్‌లో సిల్వర్ లేక్ పెట్టుబడులు, కేకేఆర్ కూడా ఆసక్తి చూపిస్తుందనే వార్తల నేపథ్యంలో షేర్లు దూసుకెళ్లాయి. రిలయన్స్ రిటైల్ దేశవ్యాప్తంగా 12000 స్టోర్స్ నిర్వహిస్తున్నది. రెండు రోజుల్లోనే షేర్లు దూసుకెళ్లడంతో రిలయన్స్ మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ.15 లక్షల కోట్ల మార్క్ సమీపానికి చేరుకుంది. మొదటిసారి జూలై 27, 2020వ తేదీన రిలయన్స్ ఇండస్ట్రీస్ మార్కెట్ క్యాప్ రూ.14.51 లక్షల కోట్లకు చేరుకుంది. రెండోస్థానంలో ఉన్న టీసీఎస్ మార్కెట్ క్యాప్ రూ.8.8 లక్షల కోట్లుగా ఉంది. టీసీఎస్‌తో రిలయన్స్ ఎం–క్యాప్ ఒకటిన్నర రెట్లకు ఎక్కువగా ఉన్నది.

## ఇంటర్ అకడమిక్ క్యాలెండర్ విడుదల

**మార్చి 24 నుంచి ఏప్రిల్ 12వరకు ఇంటర్ పరీక్షలు**

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): రాష్ట్ర ఇంటర్మీడియట్ అకడమిక్ క్యాలెండర్ విడుదలైంది. జూనియర్ కాలేజీల అకడమిక్ క్యాలెండర్‌ను తెలంగాణ ఇంటర్ బోర్డు గురువారం విడుదల చేసింది. విద్యాసంవత్సరం మొత్తం పనిదినాలు 182 రోజులు. దసరాకు 3 రోజులు, సంక్రాంతికి 2 రోజులు మాత్రమే సెలవులు. వచ్చే ఏడాది మార్చి 24 నుంచి ఏప్రిల్ 12వ తేదీ వరకు ఇంటర్ పరీక్షల నిర్వహిస్తారు. అకడమిక్ ఇయర్ లాస్ట్ వర్కింగ్ డే 2021 ఏప్రిల్ 16గా నిర్ణయించారు. ఆన్‌లైన్ ద్వారానే ఇప్పటి వరకు క్లాసులు నిర్వహణ సాగుతోంది. కరోనా నేపథ్యంలో కాలేజీలను ఇంకా తెరవలేదు. భవిష్యత్ పరిస్థితులను బట్టి మున్ముందు నిర్ణయాలు ఉండే అవకాశం ఉంది.

## ఎగువన వరదతో శ్రీశైలం 3గేట్లు ఎత్తివేత

శ్రీశైలం,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరిగింది. దీంతో శ్రీశైలం ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో మరోమారు వరదనీరు వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో జలాశయం 3 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు నీటిమట్టం గరిష్ట స్థాయిలో కొనసాగుతోంది. శ్రీశైల జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 885 అడుగులుగా ఉంది. ప్రస్తుత నీటి నిల్వ 215.80 టీఎంసీలు. ప్రాజెక్టు పూర్తి సామర్థ్యం 215.88 టీఎంసీలు. శ్రీశైలం కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

## బాలుడిని మింగిన ఈత సరదా

ఆదిలాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ఈత సరదా ఓ యువకుడి నిండు ప్రాణాన్ని బలితీసుకుంది. ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందిన విషాద ఘటన జిల్లాలోని ఉట్నూర్ మండలం హస్నాపూర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. ఏడుగురు యువకులు కలిసి గ్రామ సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో ఈత కొట్టడం కోసం వెళ్లారు. ఈతరాని షేక్ దాదు అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి గల్లంతయ్యాడు. మిగాతా ఆరుగురు బయటకు వచ్చి ఈ విషయాన్ని స్థానికులకు చేరవేశారు. పోలీసుల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టిన మృతదేహాన్నివెలికితీశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## సిఎం కెసిఆర్ చిత్రపటానికి టిఆర్ఎస్ శ్రేణుల పాలాభిషేకం

**–కొత్త రెవెన్యూ చట్టం పేదలకు వరం అన్న వంటేరు**

సిద్దిపేట,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కొత్త రెవెన్యూ చట్టంతో సిఎం కెసిఆర్ పేదలకు బ్రహ్మాస్త్రం అందించారని, వారికి అండగా నిలిచారని అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఎన్నో ఏళ్లుగా నలుగుతున్న సమస్యకు ఇప్పుడు పరిష్కారం దక్కబోతున్నది అన్నారు. మాఫియా ముఠాల నుంచి, భూబకాసురుల నుంచి, అవినీతి అధికారుల నుంచి వారికి పూర్తిరక్షణ కల్పిస్తుందని అన్నారు. సిద్దిపేట జిల్లా దుబ్బాకలో సిఎం కెసిఆర్ చిత్రపటానికి టిఆర్ఎస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. రెవెన్యూ చట్టాన్ని స్వాగతిస్తూ కెసిఆర్‌కు కృతజ్ఞతుల తెలిపారు. ఈ సందర్భంగా వంటేరు మాట్లాడుతూ ధరణి పోర్టల్‌తో రెవెన్యూ వ్యవస్థ పనితీరులో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో భూముల ధరలు పెరిగినందున, భవిష్యత్తులో శాంతి భద్రతల సమస్య తలెత్తే ప్రమాదం లేకుండా సిఎం కెసిఆర్ ఎన్నో జాగ్రత్తలతో చట్టాన్ని రూపొందించారని అన్నారు. భూములకు సంబంధించిన హద్దులు సరిగ లేకపోవడం, గట్ల పంచాయతీ, హత్యలు చేసుకోవడం.. ఇలా చాలా దూరం పోయింది. భూ సంస్కరణలు ఒక పద్ధతి ప్రకారం చేపట్టాలని ప్రయత్నాలు చాలా జరిగాయి. అయితే గతంలో ఎప్పుడూ ఇలాంటి విప్లవాత్మకమైన చట్టం రాలేదన్నారు. గత ప్రభుత్వాలు ప్రయత్నాలు చేసినా పరిష్కారం చూపలేదు. ఈ నేపథ్యంలో అవినీతి రహిత రెవెన్యూ పాలన కోసం 3 సంవత్సరాలుగా తీవ్ర కసరత్తు చేసి సాకారం చేశారని అన్నారు. : రైతు ప్రయోజనాల కోసం సీఎం కేసీఆర్ కొత్త రెవెన్యూ చట్టానికి శ్రీకారం చుట్టారని అన్నారు. వీఆర్వో వ్యవస్థ రద్దుపై హర్షిస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి ఆయన క్షీరాభిషేకం చేశారు. ముందుగా రైతు సంఘం నాయకులు, రైతులు టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ప్రతిపల్లెలో నేడు ప్రజలు సీఎం కేసీఆర్ నిర్ణయం పట్ల హర్షధ్వానాలు చేస్తున్నారన్నారు. కొత్త రెవెన్యూ చట్టం ద్వారా రైతుల భూములకు రక్షణ కల్పించేందుకు ఈ చట్టాన్ని అమలుపరిచారన్నారు. నాటి నుంచి నేటి వరకు రెవెన్యూ వ్యవస్థ వల్ల రైతాంగం అనేక ఇబ్బందులకు దారి తీసిందన్నారు.



వరంగల్ అర్బన్ జిల్లాలోని దూపకుంటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

## డబుల్ ఇళ్లను వేగవంతం చేయాలి

**దూపకుంటలో నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్**

వరంగల్ అర్బన్,సెప్టెంబర్10 (ఆర్ఎన్ఎ): జిల్లాలోని దూపకుంటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు.

గురువారం కలెక్టర్ దూపకుంటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణ పనులను అర్ అండ్ బీ, ఎస్ఈ నాగేందర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కనీసం 400 గృహాలైనా దసరా వరకు పనులను పూర్తి చేయాలన్నారు.

మిగతా ఇండ్లను యుద్ధ ప్రాతిపదిక నిర్మించాలని ఆదేశించారు. 1000 గృహాలు స్లాబ్ పూర్తయిన నేపథ్యంలో వాటిని సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయలన్నారు. ఇండ్లు పూర్తయ్యేందుకు వారం వారం ఎంత ప్రగతి సాధిస్తారో ఏజెన్సీ నుంచి పూర్తి వివరాలు తీసుకోవాలనీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట అర్ అండ్ బీ ఈఈ రాజం, డిప్యూటీ ఈఈ, జిల్లా నోడల్ అధికారి రాజేందర్ తదితరులు ఉన్నారు.

## మూఢ నమ్మకాలతోనే గుడి, మసీదు కూల్చివేత

**–సచివాలయ కూల్చివేతలపై రేవంత్ మండిపాటు**

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): కేసీఆర్ సర్కార్‌పై కాంగ్రెస్ ఎంపీ రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కేసీఆర్ మూఢనమ్మకాల కోసమే సచివాలయం, గుడి, మసీదు కూల్చివేసారని విమర్శించారు. సీఎం.. సీఎస్, డీజీపీలతో కలిసి ఈ విధ్వంసం చేశారన్నారు. అధికారులను తప్పుడు పద్ధతులకు వినియోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ జన్మస్థలం ఎర్రగడ్డ అని వ్యాఖ్యానించారు. గుళ్లను కూల్చివేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాత మ్యాప్‌లు మాయం చేసి.. కొత్త మ్యాప్‌లతో ఎన్జీటీ బృందాన్ని తప్పుదోవ పట్టించారని విమర్శించారు. సికింద్రాబాద్ ఆర్మీ ఏరియాలో ఉన్న బ్రిటీష్ లైబ్రరీలో పాత మ్యాప్ ఉందని వెల్లడించారు. కేసీఆర్ ఇస్తున్న దొంగ మ్యాప్‌లు నమ్మొద్దని 1920లో బ్రిటీష్ వారు తయారు చేసిన హైదరాబాద్ మ్యాప్ ఇచ్చినట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయానికి అన్ని అనుమతులు వచ్చాయని.. త్వరలోనే సచివాలయం నిర్మాణం చేస్తామని సునీల్ శర్మ ప్రకటించారన్నారు. రూ.400 కోట్ల నుంచి రూ.700 కోట్లకు అంచనాలు పెంచేశారని ఆరోపించారు. తట్టామట్టి ఎత్తకముందే దోపిడీకి తెరలేపారని రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు.

## మున్సిపాలిటీల్లో కనీస వసతులు కరవు

**జీరో అవర్‌లో రాజగోపాలరెడ్డి వ్యాఖ్యలు**

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి కేటీఆర్, మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మధ్య మాటల యుద్ధం జరిగింది. జీరో అవర్‌లో కోమటిరెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల్, చండూరు మున్సిపాలిటీలకు ప్రభుత్వం కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందని అన్నారు. కోమటిరెడ్డి వ్యాఖ్యలపై కేటీఆర్ స్పందించారు. చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీలకు నిధులు సమకూర్చడం లేదని చెప్పడం సత్యదూరమని కేటీఆర్ అన్నారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మున్సిపాలిటీలకు రూ. 148 కోట్లు విడుదల చేస్తున్నామని తెలిపారు. ఈ విషయాన్ని కోమటిరెడ్డి గమనించాలి. మొన్న జరిగిన 130 మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగితే.. 122 మున్సిపాలిటీల్లో చైర్మన్ పదవులను కైవసం చేసుకున్నాం. టీఆర్ఎస్ ప్రభుత్వం ఏమి చేయకపోతే ఈ గెలుపు సాధ్యమయ్యేదేనా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మీరు చెప్పేది విన్నారు.. తాము చెప్పేది కూడా విన్నారు. సత్య దూరమైన మాటలు మాని.. వాస్తవాలు మాట్లాడితే ప్రజలు కూడా హర్షిస్తారని కేటీఆర్ అన్నారు. శాసనసభలో జీరో అవర్‌లో మైక్ ఇచ్చినా.. హీరో గిరి చేస్తామంటే సరికాదని కోమటిరెడ్డికి కేటీఆర్ చురకలు అంటించారు.

## కూల్చివేతలతో శివసేనకు సంబంధం లేదు: సంజయ్ రౌత్

ముంబై,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): బాలీవుడ్ నటి కంగనా కార్యాలయంపై చర్యలతో శివసేనకు ఎలాంటి సంబంధం లేదని ఆ పార్టీ సీనియర్ నేత, ఎంపీ సంజయ్ రౌత్ తెలిపారు. కంగనా కార్యాలయంలో పాక్షిక కూల్చివేతలపై ముంబై మేయర్ లేదా బీఎంసీ కమిషనర్‌ను అడగాలని శివసేనను కాదని ఆయన అన్నారు. తమ పార్టీకి ఈ వ్యవహారంతో ఎలాంటి సంబంధంలేదని సంజయ్ రౌత్ చెప్పారు. నటి కంగనా కార్యాలయంలో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు ఆరోపించిన బీఎంసీ బుధవారం వాటిని కూల్చివేసింది. కంగనా దీనిపై బాంబే హైకోర్టును ఆశ్రయించగా కూల్చివేతలపై స్టే విధించింది. అయితే అప్పటికే అక్రమ నిర్మాణాలను కూల్చివేశామని, అక్కడ తమకు ఎలాంటి పని లేదని కోర్టుకు బీఎంసీ తెలిపింది. కాగా తనపై కక్షతోనే తన కార్యాలయాన్ని కూల్చివేసినట్లు కంగనా రనౌత్ ఆరోపించింది. కేంద్రం కల్పించిన వై ప్లస్ భద్రతతో బుధవారం ముంబైకి వచ్చిన ఆమె సీఎం ఉద్ధవ్ ఠాక్రే లక్ష్యంగా వీడియో సందేశాన్ని విడుదల చేసింది. ప్రజాస్వామ్యంలో చీకటి రోజుగా అభివర్ణించిన ఆమె, దీనికి ప్రతీకారం తీర్చుకుంటానని హెచ్చరించింది.

### పాశమైలారంలో అగ్నిప్రమాదం

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో అగ్నిప్రమాదం సంభవించింది. పిలెట్ ఫార్మా పరిశ్రమలో షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి అస్వస్థతకు గురయ్యాడు. మరొకరి కోసం సిబ్బంది గాలిస్తున్నారు. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ సిబ్బంది మూడు అగ్నిమాపక యంత్రాలతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎగసిపడుతున్న మంటలను అదపులోకి తెచ్చేందుకు శ్రమిస్తున్నారు.

## మారిటోరియం వడ్డీ భారం పడకుండా చూడండి

**–కేంద్రానికి,ఆర్‌బిఐకి సుప్రీం సూచన**

న్యూఢిల్లీ,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): మారటోరియం వ్యవధిలో నిలిచిపోయిన ఈఎంఐలపై వడ్డీ వసూలు చేయరాదని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వం, ఆర్‌బీఐ, బ్యాంకులకు రెండు వారాల

సమయం ఇచ్చింది. కరోనా వైరస్ నేపథ్యంలో ఈఎంఐల చెల్లింపుపై ఆర్‌బీఐ ఆరు నెలల మారటోరియం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే మారటోరియం వ్యవధిలో నిలిచిపోయిన ఈఎంఐలపై వడ్డీ వసూలు చేస్తామని బ్యాంకులు ప్రకటించాయి. వడ్డీపై వడ్డీ వసూలు సరైంది కాదని సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఇక రుణగ్రహీతలపై భారం పడకుండా రెండు వారాల్లోగా కేంద్ర ప్రభుత్వం, బ్యాంకులు, ఆర్‌బీఐ ఓ నిర్దిష్ట విధానంతో కోర్టు ముందుకు రావాలని ముగ్గురు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారం స్పష్టం చేసింది.

ఈ కేసును మరోసారి వాయిదా వేసేందుకు నిరాకరించిన సర్వోన్నత న్యాయస్థానం ఇదే చివరి అవకాశమని రెండు వారాల్లోగా రుణగ్రహీతలకు భారం పడనివిధంగా పరిష్కారంతో అఫిడవిట్ సమర్పించాలని కోరింది. రుణగ్రహీతలకు ఊరట ఇచ్చేలా బ్యాంకులతో ఉన్నతస్థాయిలో సంప్రదింపులు జరుగుతున్నాయని కేంద్ర ప్రభుత్వం కోర్టుకు వివరించింది. మరోవైపు సెప్టెంబర్ చివరివారంలో కేసు విచారణ తిరిగి ప్రారంభమయ్యేవరకూ ఆయా ఖాతాలను నిరర్ధక ఆస్తులుగా పరిగణించరాదని కోర్టు స్పష్టం చేసింది. మారటోరియం వ్యవధిలో ఈఎంఐలపై వడ్డీ మాఫీ చేస్తే అది బ్యాంకింగ్ వ్యవస్థను బలహీనపరుస్తుందని బ్యాంకులు వాదిస్తున్నాయి. కాగా కరోనా వైరస్ నేపథ్యంలో? ఆర్‌బీఐ రుణాల చెల్లింపుపై ఈ ఏడాది మార్చిలో మూడు నెలల మారటోరియం ప్రకటించి ఆపై ఆగస్ట్ 31 వరకూ పొడిగించిన సంగతి తెలిసిందే.

## హైదరాబాద్‌లో భారీ వర్షం: చల్లబడ్డ వాతావరణం

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలో ఆకస్మికంగా వాతావరణ పరిస్థితులు మారాయి. ఉన్నట్టుండి గురువారం మధ్యాహ్నం నగరంలోని పలు చోట్ల వర్షం కురిసింది. దీంతో గత కొద్ది రోజుల నుంచి ఉక్కపోతకు గురవుతున్న నగర ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. గత కొద్ది రోజుల నుంచి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్న విషయం తెలిసిందే. ఖైరతాబాద్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, కొండపూర్, మెహిదీపట్నం, లక్డికాపూల్, అసెంబ్లీ, అబిడ్స్, కోఠి, మలక్ పేట్, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, హయత్ నగర్, సంతోష్ నగర్, చంపాపేట్, అంబర్‌పేట, రాంనగర్, తార్నాక, ముషీరాబాద్, సికింద్రాబాద్, బేగంపేట, తార్నాక, బోయిన్‌పల్లి, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, అమీర్‌పేటలో వర్షం కురిసింది.

## ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించగలరా ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు

హైదరాబాద్,సెప్టెంబర్10(ఆర్ఎన్ఎ): ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించగలరా అని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. సాంకేతికతను ఉపయోగించుకుని ఇంజనీరింగ్ కోర్సులకు ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించవచ్చని హైకోర్టు అభిప్రాయపడింది. అలాగే సప్లమెంటరీలో ఉత్తీర్ణులైన వారిని కూడా రెగ్యులర్‌గా పరిగణిస్తారా అని హైకోర్టు అడిగింది. తెలంగాణలో డిగ్రీ, పీజీ చివరి సెమిస్టర్ పరీక్షల నిర్వహణపై హైకోర్టు గురువారం విచారణ జరిపింది. కరోనా వైరస్ కారణంగా హాస్టల్స్ మూసి ఉన్నందున పరీక్షలు రాసేందుకు విద్యార్థులు ఇబ్బంది పడతారని, చివరి సెమిస్టర్ పరీక్షలన్నీ ఆన్‌లైన్‌లో నిర్వహించాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోరారు. పిటిషనర్ వాదనపై స్పందించిన న్యాయస్థానం.. న్యాయస్థానం ప్రశ్నలకు స్పందించిన అడ్వకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్.. ప్రభుత్వాన్ని అడిగి చెప్తానని అన్నారు. దీంతో విచారణ ఈనెల 15కు వాయిదా వేసింది. మరోవైపు లాక్‌డౌన్ కారణంగా నిలిచిపోయిన వివిధ డిగ్రీ కోర్సుల చివరి సంవత్సరం పరీక్షల నిర్వహణకు ఉస్మానియా యూనివర్సిటీ సిద్ధమైంది. ఈనెల 22 నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, బీబీఏ, ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పరీక్షలు మొదలవుతాయి. అదేవిధంగా ఈనెల 15 నుంచి ఇంజనీరింగ్, బీసీఏ, బీఈడీ, బీఫార్మసీ, డిప÷–లొమా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్, బ్యాచిలర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్షలు నిర్వహించేందుకు స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.